www.bharathasakthi.com

# భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 10 | ఆదివారం,జూన్ 14 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## టీఎంసీలో ముదురుతున్న సంక్షోభం..
## కేంద్ర మంత్రితో మమత సన్నిహితుడు భేటీ



పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తీవ్రతరమవుతోంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడు, సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ శనివారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ సమావేశంలో తిరుగుబాటు ఎంపీ శతాబ్ది రాయ్ సైతం

2లో..

## యుద్ధాన్ని ముగించేందుకు
## సమయం ఆసన్నమైంది మిత్రమా!

**- నెతన్యాహుతో ట్రంప్**

- ఇరాన్‌తో ఒప్పందం కొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం
- నెతన్యాహుకు ట్రంప్ ఫోన్‌లో స్పష్టమైన సందేశం
- 60 రోజుల కాల్పుల విరమణకు ప్రతిపాదనలు
- హర్మూజ్ జలసంధి పునఃప్రారంభం ప్రతిపాదన
- అణు కార్యక్రమంపై ఇరాన్‌తో మరిన్ని చర్చలు

2లో..



## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ
# తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి

**- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13:** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. "బాల్యం ప్రతి చిన్నారి జన్మహక్కు. చదువుకోవడం, ఆడుకోవడం, ఆనందంగా ఎదగడం, తమ కలలను సాకారం చేసుకునే అవకాశాలు పొందడం ప్రతి పిల్లవాడి సహజ హక్కు. ఆ హక్కులను హరించే బాల కార్మిక వ్యవస్థకు సమాజంలో చోటు లేకుండా చేయడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదే సమయంలో కుటుంబాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి పౌరుడు ఈ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదని, ఎక్కడైనా చిన్నారులు పనుల్లో నిమగ్నమైనా, కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఒక చిన్నారిని బాల కార్మికత్వం నుంచి బయటకు తీసుకురావడం అంటే అతనికి లేదా ఆమెకు ఒక కొత్త భవిష్యత్తును అందించినట్టేనని పేర్కొన్నారు. "పిల్లల చేతుల్లో పనిముట్లు కాదు పుస్తకాలు ఉండాలి. వారి భుజాలపై భారం కాదుభవిష్యత్తుపై ఆశలు ఉండాలి. ప్రతి చిన్నారి నవ్వుతూ, నేర్చుకుంటూ, కలలు కంటూ ఎదిగే తెలంగాణను నిర్మించడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.



## కార్మిక శ్రేయస్సే ధ్యేయం..
# వెనకడుగు వేసేదే లేదు



- సింగరేణి సంస్థ - తెలంగాణ ప్రజల ఆస్తి - నియామక పత్రాలు అందజేత
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 13 (భారత శక్తి):** సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి.,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల

2లో..

## కోవర్ట్‌ల సంగతి
# తేలుస్తాం

**- వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు:మహేశ్ గౌడ్**



**హైదరాబాద్ (భారత శక్తి)** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు.

2లో..

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా
# లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్
- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- పలు కీలక కమాండ్లకు నాయకత్వం
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర



**న్యూఢిల్లీ (భారత శక్తి)** భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో
# కీలక పరిణామం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు**

- తుమ్మల నివాసానికి వెళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్
- తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు
- తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయ పరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా

**- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13: భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్‌గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. "జస్పాల్ రాణా మరణంతో భారతదేశం ఒక గొప్ప క్రీడాకారుడిని మాత్రమే కాకుండా, తన ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాసేవతో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే ఓ మార్గదర్శకుడిని కోల్పోయింది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ విషాద సమయంలో జస్పాల్ రాణా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, క్రీడా రంగానికి చెందిన వారందరికీ ముఖ్యమంత్రి తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..
## కార్యకర్తలకు దిశానిర్దేశం

- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు



**హైదరాబాద్ (భారత శక్తి)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను

2లో..

# యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!

ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశముందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. "ఇది మంచి ఒప్పందం.. యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది" అని నెతన్యాహుకు ట్రంప్ చెప్పినట్లు సమాచారం. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని ఇరు దేశాల అధికారులు చెబుతున్నారు. గతంలో ఇరాన్‌లో పాలన మార్పే లక్ష్యమని వాదించిన నెతన్యాహు.. ఇప్పుడు ట్రంప్ ముందుకు తీసుకెళుతున్న ఒప్పందాన్ని అడ్డుకోలేమనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ఆందోళనలను ఒప్పందంలో పరిగణనలోకి తీసుకుంటారని ట్రంప్‌పై తనకు నమ్మకం ఉందని ఆయన చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ప్రతిపాదిత ఒప్పందంపై ఇజ్రాయెల్ పూర్తిగా సంతృప్తిగా లేదని సమాచారం. ఆంక్షల సడలింపుతో ఇరాన్ చమురు విక్రయాలు పెంచుకొని ఆర్థికంగా బలపడొచ్చని, అదే సమయంలో అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయకపోవచ్చని ఇజ్రాయెల్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ.. అమెరికా తన ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందం కుదుర్చుకుంటున్నప్పటికీ ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణులు, అనుబంధ తీవ్రవాద సంస్థల విషయంలో తమ భద్రతా ఆందోళనలు కాపాడాలని ఆశిస్తున్నామని చెప్పారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికా-ఇరాన్ మధ్య త్వరలో ఓ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరే అవకాశం ఉంది. ఇందులో 60 రోజుల కాల్పుల విరమణ, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు కార్యక్రమంపై తదుపరి చర్చలకు మార్గం సుగమం చేసే అంశాలు ఉండనున్నాయి. అలాగే హర్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ పోర్టులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మడ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు.సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం

నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

# కార్మిక శ్రేయస్సే ధ్యేయం.. వెనకడుగు వేసేదే లేదు

శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, వైరా నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని, సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కొరకు 70 కోట్ల రూపాయలు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు 74 కోట్ల 40 లక్షల రూపాయలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన 335 మంది అర్హత గల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకుందాం అని, తెలంగాణ ఆస్తిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల బీమా అందించడం జరుగుతుందని, 30 వేల మంది ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని తెలిపారు. కోల్ బ్లాక్స్ లలో పూర్తి నిఘా వ్యవస్థ మధ్యలో పని జరుగుతుందని, తెలంగాణ వనరులను కాపాడతామని తెలిపారు. కోల్ బెల్ట్ ప్రాంతంలోని శాసనసభ్యులతో మాట్లాడి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి మాట్లాడుతూ సింగరేణి సంస్థను, తెలంగాణ నల్ల బంగారం బొగ్గును కాపాడుకుందాం అని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మెడికల్ అన్ ఫిట్ విషయంలో పారదర్శకంగా ముందుకు వెళదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల రూపాయలతో పాటు ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి 40 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

సింగరేణి సంస్థ లాభాలలో సింగరేణి కార్మికులతో పాటు ఒప్పంద కార్మికులకు లాభాల వాటా అందించడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న 335 మందిలో 117 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. సింగరేణి సంస్థలో మారుపేరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఒక కమిటీని నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని, బాధితులకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందని, పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు అందించడం జరిగిందని తెలిపారు. రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు.

సింగరేణి ప్రాంతాలలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను పదవీ విరమణ పొందిన కార్మికులకు అందించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్నులు వెసలుబాటు కల్పించాలని, జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో గల శ్రీరాంపూర్ ప్రాంతంలో అర్హులకు పట్టాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ 1992లో సింగరేణి సంస్థను 450 కోట్ల రూపాయలకు బి ఐ ఎఫ్ ఆర్ క్రిందకు పంపించడాన్ని ఆనాడు గడ్డం వెంకటస్వామి అడ్డుకొని కాపాడారని గుర్తు చేశారు. కార్మికులకు సింగరేణి లాభాలలో వాటా ఇప్పించడం జరిగిందని తెలిపారు.అనంతరం అర్హులైన సింగరేణి కార్మిక కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, సింగరేణి సంస్థ అధికారులు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రాజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# టీఎంసీలో ముదురుతున్న సంక్షోభం..

పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీకి చెందిన సుమారు 20 మంది లోక్‌సభ సభ్యులు తమను ప్రత్యేక బృందంగా గుర్తించాలని కోరుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల వెలువడిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీఎంసీ ఓటమి పాలవగా, బీజేపీ నేత సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో మొదలైన విభేదాలు ఇప్పుడు పార్లమెంటు స్థాయికి చేరాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు, బీజేపీలో విలీనం కాకుండానే ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని తిరుగుబాటు వర్గం భావిస్తోంది. కాకోలీ ఘోష్ దస్తీదార్ వంటి నేతల నేతృత్వంలో తామే అసలైన టీఎంసీ అని ఈ వర్గం వాదిస్తోంది. తిరుగుబాటు ఎంపీ జగదీష్ బసునియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ బృందం ఆదివారం ఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని, సోమవారం (జూన్ 15న) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనుంది. సభలో తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని వారు స్పీకర్‌ను కోరనున్నారు. తొలుత ప్రచారంలో ఉన్న 19 మంది తిరుగుబాటు ఎంపీల జాబితాలో సుదీప్ బందోపాధ్యాయ పేరు లేదు. అయితే, కేంద్ర మంత్రితో ఆయన నేరుగా సమావేశం కావడంతో పార్టీలో చీలిక లోతుగా ఉందనే విషయం స్పష్టమవుతోంది. అయితే, సుదీప్ తీరుపై టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మరోవైపు, పార్టీ విధేయ వర్గంలోని కొందరు నేతలు ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నారు. గతంలో అభిషేక్ బెనర్జీపై విమర్శలు గుప్పించిన కల్యాణ్ బెనర్జీ, తాజాగా ఆయనను "నా కొడుకు వంటివాడు" అంటూ స్వరం మార్చారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలి.



న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. మెట్రో ఫేజ్-2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఖట్టర్ కు గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

# ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలి



**న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13 :** దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ 6 మహానగరాల అభివృద్ధి కోసం రూ. 6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని సూచించారు. ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఒక్కో నగరానికి రూ. 1 లక్ష కోట్ల చొప్పున అందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ సమావేశంలో పలు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కుల గణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను సమావేశంలో వివరించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో 2వ దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశం ప్రగతి సాధించడానికి విద్య, వైద్యం బలమైన పునాదిగా నిలుస్తాయని ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అని, ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (రాజుజుజ్బూజ)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో ఆర్థిక స్థితిగతులు, భూమి కంటే విద్య.. సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా వెల్లడైందన్నారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ఈ ప్రాధాన్యత నేపథ్యంలోనే విద్యా శాఖను స్వయంగా తానే నిర్వహిస్తున్న విషయాన్ని, విద్యా రంగంలో తీసుకురావలసిన సంస్కరణలను ప్రస్తావించారు. "గడచిన 75 ఏండ్లలో ఉచిత విద్య అందించేందుకు అందరూ ప్రయత్నించారు. కానీ నాణ్యమైన విద్యను అందించడం ఒక సవాలుగా మారింది. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టింది" అని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తెలంగాణలో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా స్కూల్స్ సందర్శిస్తే సంతోషిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరం. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నాం. టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందని అన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని గుర్తుచేస్తూ, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని దాని ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశంలో 12 ఏళ్ల మోదీ సుపరిపాలన

## - తెలంగాణలో వచ్చేది బీజేపి ప్రభుత్వమే - మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్



**ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 14 (భారత శక్తి):** భారతదేశంలో నరేంద్ర మోదీ 12 ఏళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికలలో బిజెపి ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుతున్నారని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు.ములుగు జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజాలో శనివారం భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన పై బిజెపిములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి కొండేటి శ్రీధర్ మాజీ శాసనసభ్యులు హాజరై మాట్లాడారు.స్వతంత్రం వచ్చినప్పటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని సంవత్సరాలు పరిపాలించిన దేశంలో అభివృద్ధి జరగలేదని విలేకరుల సమావేశంలో వెల్లడించారు.కేవలం 12 సంవత్సరాల పాలనలో నరేంద్ర మోడీ భారతదేశాన్ని అభివృద్ధి పరంపర కొనసాగేలా చేశారని కొనియాడారు. అంతేకాక ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న 370 ఆర్టికల్ రామమందిర నిర్మాణం కామన్ సివిల్ కోడ్ ట్రిపుల్ తలాక్ వంటి ఎన్నో బృహత్తర సమస్యలకు పరిష్కారం లభించింది కేవలం నరేంద్ర మోడీ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం ద్వారానే జరిగిందని అనేక నేషనల్ హైవేస్ విమానాశ్రయాలు బుల్లెట్ ట్రైన్స్ ఆధునీకరణ సామాన్యులకు అందుబాటులో డిజిటల్ పేమెంట్ ద్వారా ప్రపంచంలోనే అగ్రగామిగా భారతదేశాన్ని నిలబెట్టిన నిలబెట్టిన ఘనత మన ప్రియతమ మోడీకే దక్కుతుందని తెలిపారు ప్రపంచ దేశాలు మోడీ ముందు మోకరిల్లుతున్నాయని యుద్ధం సమయంలో భారతీయులను క్షేమంగా తీసుకువచ్చిన ఘనత నా మోడీ గారికే దక్కుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో బిజెపి లేకున్నా కేంద్రం నుండి ఎన్నో నిధులను ఇచ్చి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నరేంద్ర మోడీ దోహదపడ్డారని అన్నారు ములుగు ఏజెన్సీ ప్రాంతానికి విద్యుల విశ్వవిద్యాలయంతో పాటు ప్రపంచ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి గుర్తింపు అందించడం అభినందనీయమన్నారు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఎన్నో అభివృద్ధి పదాలను అందించిన మహా నాయకుడు నరేంద్ర మోడీ అని కొనియాడారు ముచ్చటగా నాలుగోసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడం ఖాయమని, తెలంగాణ రాష్ట్రంలో బిజెపి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి అధికారం ప్రజలు కట్టనున్నారని దీమా చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్య జవహర్లాల్ అజ్మీర కృష్ణవేణి నాయక్ రాష్ట్ర నాయకులు భూక్య రాజు నాయక్ ఉపాధ్యక్షులు జింకల కృష్ణాకర్ రావు అల్లే శోభన్ జిల్లా నాయకులు సూర్యదేవర విశ్వనాథ్ గంగిశెట్టి రాజకుమార్ కన్నోజు సునీల్ కుమార్ దొంతి రెడ్డి రవి రెడ్డి కారుపోతుల యాదగిరి గౌడ్ దండిగా వెంకటేశ్వర్లు పట్టణ అధ్యక్షులు ఉమ్మడి రాకేష్ యాదవ్ మండల అధ్యక్షులు రాయచ నాగరాజు బైకని మహేందర్ పైడ్ ఆకుల మల్లేష్ మమన్ యాదవ్, రవితేజ యాదవ్, పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మొహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్‌మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్-రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇటీఎఫ్ ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు? డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం? ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో? పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి. చిన్న మొత్తాలతో పెట్టుబడి ప్రారంభించే అవకాశం కూడా యువతను డిజిటల్ గోల్డ్ వైపు ఆకర్షిస్తోంది. సాధారణంగా భౌతిక బంగారం కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అవసరమవుతాయి.

డిజిటల్ గోల్డ్‌లో ఒకటి నుంచి వంద రూపాయల చిన్న మొత్తాల నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీంతో విద్యార్థులు, యువ ఉద్యోగులు, చిన్న పెట్టుబడిదారులు కూడా డిజిటల్ బంగారంలో పెట్టుబడి పెట్టగలుగుతున్నారు. అదనంగా? నెలవారీ ఆటోమేటిక్ సేవింగ్స్ విధానాల ద్వారా క్రమం తప్పకుండా బంగారం కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. టన్నుల కొద్దీ బంగారం కొనే మన దేశంలో.. గ్రాములు కొనడానికి కూడా సామాన్యుడు వెనుకాడుతున్నాడు. షాపులు కస్టమర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు డిస్కౌంట్లు ఇస్తామన్నా జనం అడుగు ముందుకు వేయడం లేదు. శతాబ్దాలుగా వస్తున్న గోల్డ్ సెంటిమెంట్‌ను దాటి ప్రజలు ఆలోచిస్తున్నారు. బంగారం ధరలు తగ్గినా?కొనుగోళ్లు పెరగడకపోవడం ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పునకు ఒక నిదర్శనం. గోల్డ్ కొనుగోళ్లు తగ్గడం అనేది కేవలం ఒక లోహం ముచ్చట కాదు. ఇది దేశంలోని మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనడానికి, వారి ఆర్థిక సందిగ్ధతకు ఒక ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునకు జనం ఏస్థాయిలో జేజేలు కొడతారు అనడానికి తగ్గిన గోల్డ్ డిమాండే ఉదాహరణ.

# హస్తినకు రాములమ్మ...

**హైదరాబాద్,** తెలంగాణ కాంగ్రెస్ నేత విజయశాంతి పార్టీ వైపు చూడటం లేదు. పదవిలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ అంతే. కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. కానీ ఎమ్మెల్సీ పదవితో ఆమె సంతృప్తికరంగా లేనట్లు కనపడుతుంది. తన రేంజ్ కు మంత్రి పదవి దక్కాలన్న యోచనలో విజయశాంతి ఉన్నారని చెబుతున్నారు. అందుకే విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రమే హాజరవుతూ మొక్కుబడిగా ప్రశ్నలు వేస్తున్నారు. మొన్న జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి మరోసారి విజయశాంతి తన అక్కసును వెళ్లగక్కారు.కాంగ్రెస్ లో త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతుంది. అయితే అన్ని రకాల అర్హతలున్న తనకు మంత్రి పదవి ఎందుకు దక్కడం లేదన్నది ఆమె సన్నిహితుల వద్ద ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విజయశాంతి పేరు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అసలు విజయశాంతి పేరును ఎవరూ ఊహించ లేదు. ఢిల్లీలో ఉండి మల్లికార్జున ఖర్గేను కలిసినప్పటికీ ఆమె పేరు ఖరారు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎవరూ భావించలేదు. నేరుగా హైకమాండ్ ను కలసి తనకు ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్న ఘనత విజయశాంతిది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాహుల్ ను కలసి తమకు మంత్రిపదవి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో రాములమ్మ కూడా హస్తిన బాట పడుతున్నారన్న టాక్ వినపడుతుందిఎమ్మెల్సీ వచ్చిన ఆనందం మాత్రం ఆమెలో కనిపించడం లేదు. తాను మంత్రి పదవికి పూర్తి స్థాయిలో అర్హత కలిగిన నేతనంటూ మరోసారి ఢిల్లీకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా నేరుగా ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ ను కలసి తన మంత్రి పదవి చర్చించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తనకు మంత్రి పదవి ఇస్తే తాను పార్టీకి ఏం చేయదలచుకున్నానో.. కూడా హైకమాండ్ కు నివేదించేందుకు ఒక బ్లూ ప్రింట్ ను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద విజయ శాంతి ఎమ్మెల్సీగానే ఊహించని విధంగా అయినప్పుడు మంత్రి కావడంలో పెద్దగా ఎవరూ నోరు వెళ్లబెట్టాల్సిన పనిలేదంటున్నారు సొంత పార్టీ నేతలు.

**ఆగని అంతర్గత పోరు** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కారానికి గురయింది. అయితే అందుకు తెలంగాణాలో నమోదయిన కేసు కారణమని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అఫడవిట్ లో కేసు గురించి పేర్కొనకపోవడంతో మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల అధికారులు మీనాక్షి నామినేషన్ ను తిరస్కరించారు. అయితే తెలంగాణలో ఆమెపై కేసు నమోదు కాలేదు. కేవలం ఒక కేసులో న్యాయస్థానం సమన్లు మాత్రమే జారీ చేసింది. ఇవన్నీ పక్కన పెడితే అసలు తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పై కేసు ఉన్నట్లు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు ఉప్పు అందించిందెవరు? అన్నదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.మీనాక్షి నటరాజన్ స్ట్రయిట్ ఫార్వార్డ్ నేత. నిరాడంబరంగా ఉంటారు. ఖరీదైన జీవితాన్ని కూడా ఆశించరు. దీపా మున్షీ దాస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ లో ఇన్ ఛార్జి పదవి తీసుకున్న వెంటనే ఒకే మాట చెప్పారు. పార్టీకి నమ్మకంగా ఏళ్ల నుంచి పనిచేసిన వారికే ప్రథమంగా గుర్తింపు ఉంటుందని, ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు తర్వాత ఇస్తామని నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో పాటు ఆమె కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరగలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి నివేదికలను అందిస్తున్నారన్న అనుమానం ఇక్కడి నేతలకు ఉంది.మీనాక్షి నటరాజన్ పార్టీ ఇన్ ఛార్జిగా పదవి బాధ్యతలను తీసుకున్న తర్వాత తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీలో శత్రువులు పెరిగారన్నది అంతే వాస్తవం. మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు సయితం నామినేషన్ తిరస్కారానికి గురైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన సమాచారం మేరకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే మీనాక్షి నటరాజన్ పై బీజేపీ నేతలకు సమాచారం ఇచ్చిందెవరు? అన్నదానిపై ఇప్పుడు కాంగ్రెస్ లో పోస్టుమార్టం జరుగుతుంది. కానీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాత్రం తెలంగాణ కాంగ్రెస్ నుంచి ఎవరూ సమాచారం ఇవ్వలేదని, కేవలం తెలంగాణ బీజేపే నేతలు ఇచ్చిన సమాచారంతోనే వారు ఫిర్యాదు చేశారంటున్నారు. మొత్తం మీద మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్ లో ప్రకంపనలు పుట్టిస్తుంది.

## ఇకపై డిజిటల్ పౌర సేవల కేంద్రాలుగా

# సహకార సంఘాలు

**నల్గొండ,** గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఒక చిన్న సర్టిఫికేట్ కోసమో, పాస్‌పోర్ట్ దరఖాస్తు కోసమో పట్టణాల్లోని మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే రోజులకు త్వరలోనే తెరపడనుంది. గ్రామాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలనే ఇకపై మల్టీ సర్వీస్ డిజిటల్ హబ్‌లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ భారత్ చొరవతో, నాబార్డు సమన్వయంతో రూపుదిద్దుకుంటున్న ఈ సరికొత్త కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా.. ఆధార్, పాన్ కార్డు సేవలతో పాటు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు సేవలను రైతుల వద్దకే తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న డిజిటల్ పని కోసమైనా, ప్రభుత్వ సేవలను పొందాలన్నా మండల కేంద్రాలకో లేదా పట్టణాలకో పరుగులు తీసే రోజులు త్వరలోనే కానరాకుండా పోనున్నాయి. ఇకపై మీ గ్రామంలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారానే సమస్త డిజిటల్ పౌర సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ సంఘాలన్నింటినీ కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్‌సీ) మార్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాలు అంటే కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడానికే పరిమితం అనే భావన ఉంది. అయితే వీటికి పూర్తిస్థాయిలో డిజిటల్ హంగులు అద్ది, డిజిటల్ భారత్ పథకంలో భాగంగా గ్రామీణులకు అవసరమైన అన్ని రకాల సామాజిక, సంక్షేమ, విద్యా, ఆరోగ్య సేవలను ఒకే చోట అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే కేంద్ర సహకార శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డుల మధ్య జాతీయ స్థాయిలో కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సరికొత్త డిజిటల్ విప్లవం ద్వారా పీఏసీఎస్‌లు కేవలం వ్యవసాయ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త ఉపాధి అవకాశాలను సృష్టించే డిజిటల్ హబ్‌లుగా రూపాంతరం చెందనున్నాయి.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని ఈ ఏడాది ఆఖరు నాటికి వంద శాతం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే తొలి విడతగా రాబోయే ఆగస్టు 15వ తేదీ నాటికి 562 సంఘాల్లో సేవలను ప్రారంభించేందుకు ఐటీ శాఖ మద్దతుతో లైసెన్సులు, ఆన్‌లైన్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే 15 కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. అలాగే డిజిటల్ సేవలతో పాటుగా ప్రభుత్వ, వ్యాపార విభాగాలు కూడా ఇక్కడే కొలువుదీరనున్నాయి.అయితే ఈ కామన్ సర్వీస్ సెంటర్లలో ఆధార్ కార్డు అప్‌డేట్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ఓటరు గుర్తింపు కార్డులు, జనన మరణాల నమోదు చేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భూసార పరీక్ష కార్డులు, డెయిరీ, మత్స్య పరిశ్రమ సేవలు, రేషన్, గోదాముల నిర్వహణ వంటి సేవలను కూడా అందిస్తారు. అలాగే జీవన్ ప్రమాణ్ పత్రాలు, శ్రమయోగి మాన్‌ధన్ పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఐటీ రిటర్న్‌ల దాఖలు, జీవిత బీమా, విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపులు, వాహన్, ఈ చలాన్, ఈ స్టాంపుల జారీ, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్ సదుపాయం కూడా ఇక్కడ లభిస్తుంది.వీటన్నింటితో పాటు భవిష్యత్తులో ఈ సహకార సంఘాలను జన ఔషధి కేంద్రాలుగా మార్చి.. రాయితీ ధరలపై నాణ్యమైన ఔషధాలను విక్రయించడానికి కూడా ప్రత్యేక లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ చొరవతో గ్రామీణ ప్రజల సమయం, డబ్బు భారీగా ఆదా కానున్నాయి.

## రేణిగుంటలో ఇసుక రీచ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**కరీంనగర్** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామంలో గనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇసుక రీచ్ ద్వారా స్థానిక యువతకు, గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.రీచ్ నిర్వహించడం వల్ల గ్రామానికే కాకుండా రాష్ట్రానికి కూడా ఆదాయం సమకూరుతుందన్నారు .ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా కార్యకలాపాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.గ్రామాభివృద్ధి, ప్రజల జీవనోపాధి మెరుగుదల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇసుక ట్రాక్టర్లు నడుపుకొని జీవనం సాగించే వారికి ఇదొక మంచి అవకాశమని, తాగి ట్రాక్టర్లు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని ఆయన సూచించారు.

మితిమీరిన వేగంతో ట్రాక్టర్ నడపకూడదని, అతివేగమే ప్రమాదాలకు హేతువు అని ఆయన గుర్తు చేశారు. ఇసుక ట్రాక్టర్లను పోలీసులు ఆపినప్పుడు వాటికి సంబంధించిన పత్రాలను చూపించాలని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్,ఎస్ఐ అన్వర్, సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి గనుల శాఖ ఆర్ఐ తోపాటు తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి,పార్టీ నాయకులు రాములు యాదవ్, ఎల్క రాజు,తుమ్మనపల్లి శ్రీనివాసరావు,గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, తమ్మినవేని రమేష్, కంది అశోక్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ గార్డెన్ టూ లక్డీకాపూల్

### - 1.5 కిలోమీటర్ల వై షేప్ లో ఫ్లైఓవర్

**హైదరాబాద్** హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కోర్ సిటీ పరిధిలోని నాంపల్లి, అసెంబ్లీ, లక్డీకాపూల్ మార్గాల్లో నిత్యం నరకంగా మారుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. పబ్లిక్ గార్డెన్ నుంచి అసెంబ్లీ వెనుక వైపుగా లక్డీకాపూల్ వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున ఆంగ్ల అక్షరం 'జ' (వై) ఆకారంలో నిర్మించ తలపెట్టిన ఈ వంతెనకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ప్రణాళికలు, డిజైన్లను సిద్ధం చేసింది.సాధారణంగా నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణాల సమయంలో ప్రైవేటు ఆస్తుల సేకరణ పెద్ద సవాలుగా మారుతోంది. భూసేకరణ కారణంగా కోర్టు కేసులు, పరిహారం వివాదాలు తలెత్తి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రతిపాదిత వంతెనను గరిష్ఠంగా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించేలా అధికారులు చాకచక్యంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ ఇప్పటికే సమగ్ర సర్వేను పూర్తి చేసింది. దాదాపు 99 శాతం వరకు ప్రభుత్వ ఆస్తులను కేటాయించింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తుల అవసరం ఎక్కువగా లేకుండా, ఎక్కడా వివాదాలకు తావులేకుండా ఈ ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను రూపొందించింది.ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ముందు భాగం నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా, అసెంబ్లీ వెనుక వైపు నుంచి రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ వద్దకు చేరుకోగానే ఈ వంతెన రైల్వే లైన్ మీదుగా ప్రయాణించి లక్డీకాపూల్ జంక్షన్‌ను దాటుతుంది. ఇక్కడే అసలు ఇంజినీరింగ్ అద్భుతం జరగనుంది. జంక్షన్ దాటిన తర్వాత ఈ ఫ్లైఓవర్ రెండుగా చీలిపోతుంది. అంటే 'వై' షేప్‌గా మారుతుంది. ఇందులో ఒక మార్గం నేరుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే రహదారికి, మరో మార్గం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారికి అనుసంధానం అవుతుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కంటే ముందే లక్డీకాపూల్ ప్రధాన రహదారిపై ఈ వంతెన ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు.హైదరాబాద్-విజయవాడ రహదారికి అనుసంధానంగా ఉండే ఈ కోర్ సిటీ రూట్‌లో భారీ వాహనాల రాకపోకల వల్ల రాత్రి వేళల్లోనూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ఆంక్షల వల్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ లేదా మాసబ్ ట్యాంక్ వైపు సిగ్నల్ ఫ్రీగా వెళ్లవచ్చు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దీనిని పూర్తిగా 'వన్-వే'గా మార్చనున్నారు. నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే దీనిపై అనుమతి ఉంటుంది. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను దీనిపైకి అనుమతించరు.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

**హైదరాబాద్** రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల అక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధిత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

# రాజ్యాంగ సంస్థలను బలహీనపరుస్తున్న కేంద్రం

### - సర్ పై బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి:

### - అవగాహన శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరుస్తోందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు.శనివారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సర్ పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని,ఇలాంటి తరుణంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుకూలురను, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే కుట్రలో భాగంనే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) చేపట్టిందని ఆయన ఆరోపించారు. సర్ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే పార్టీకి అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత బూత్ స్థాయి కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించి, కొత్తగా అర్హత పొందిన యువత పేర్లు నమోదు చేయించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పై కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు మానకొండూర్ నియోజకవర్గ సమన్వయకర్త, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అవగాహన కల్పించారు. సర్ లోని వివిధ అంశాలపై వివరిస్తూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అంతే కాకుండా బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల సందేహాలను నరేందర్ రెడ్డి నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం,మానకొండూర్, శంకరపట్నం మండలాల పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, లింగాల శ్రీనివాస్, బొడ్డు సునిల్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండారి తిరుపతి, పార్టీ మండల పార్టీ మాజీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, నందగిరి రవీంద్రచారి, ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్లు పులి కృష్ణ, మద్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మామిడి అనిల్, కంది అశోక్ రెడ్డి, టి.రమేశ్, చింతల లక్ష్మారెడ్డి, తొర్తి అరవింద్ తోపాటు పార్టీ జిల్లా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

### అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులు

# త్వరగా పూర్తి చేయాలి

**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్, జూన్ 13 (భారత శక్తి):** చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండటంపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఏం.ఏం.సి.ప్రాజెక్ట్ ఈ.ఈ. రోహిణితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, దాదాపు రెండున్నర నెలల క్రితం ప్రారంభమైన రోడ్డు మరమ్మత్తు పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.రోడ్డు పనులు ఆలస్యం కావడం వల్ల హయత్‌నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.యూ-టర్న్ కోసం ఎల్బీ నగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు.ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు రేయింబవళ్లు పనిచేసి చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే పది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ వర్క్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ పరిశుభ్రత కార్యక్రమం విజయవంతం

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కంకణ బదులు కావాలి
- ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
- నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్




**నర్సాపూర్, జూన్ 13,(భారత శక్తి న్యూస్):** మెదక్ జిల్లా నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో సేవ్ వాటర్, నేచర్ ఫౌండేషన్, గ్లోబల్ స్కూల్, యూత్ ఫర్ సేవ్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం నిర్వహించి అటవీ పరిశుభ్రత కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు,వాకింగ్ క్లబ్ సభ్యులు, సామాజిక సేవకులు, విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అటవీ ప్రాంతాన్ని పరిశుభ్రపరచడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరూ కంకణబద్ధులై ప్రతి చిన్నారి నుండి వృద్ధాప్యం వరకు పుట్టినరోజు సందర్భంగా వారి వారి పరిసరాలలో మొక్కలు నాటాలని తద్వారా మంచి ఆక్సిజన్ ని పొందే అవకాశం ఉందని,పాడి పంటలు బాగా పండాలంటే వర్షాలు కురవడానికి అడవులను సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగితే మానవాళి మనుగడకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు, మేఘన ముసునూరి, ఫౌండేషన్ గ్లోబల్ స్కూల్ ప్రతినిధులు, యువకులు, పర్యావరణ ప్రేమికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా జేఎన్‌టీయూహెచ్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు

**హైదరాబాద్** జేఎన్‌టీయూహెచ్: ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా ఖష్త్రఆ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎల్.సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

## వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈరోజు కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు.వర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పైకి ఫస్ట్ ఎయిడ్ సెంటర్...లోన అక్రమ అబార్షన్లు

**ఎల్బీనగర్, జూన్ 13 (భారత శక్తి):** అక్రమ అబార్షన్ కేంద్రంపై పోలీసుల దాడి అనుమతులు లేకుండా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహణ.. మహిళల ప్రాణాలతో చెలగాటం.డెకాయ్ ఆపరేషన్‌లో వెలుగులోకి అక్రమ కార్యకలాపాలు.నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపురి కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అక్రమంగా అబార్షన్లు చేస్తున్న వ్యవహారం పోలీసుల డెకాయ్ ఆపరేషన్‌లో బట్టబయలైంది. మహిళల ఆరోగ్యంతో పాటు వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే విధంగా ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, జైపురి కాలనీలో రోడ్ నెంబర్-2 లో శంకర్ ఇంటికి చెందిన రెండు షట్టర్లను అద్దెకు తీసుకుని బండారు వెంకట లక్ష్మి "కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్" పేరుతో గత కొంతకాలంగా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ గర్భిణీ మహిళలకు అక్రమంగా అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు తెలిసి ఎస్‌వోటీ ఎల్బీనగర్ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు.దర్యాప్తులో భాగంగా గర్భిణీ మహిళగా ఓ మహిళా కానిస్టేబుల్‌ను కేంద్రానికి పంపించారు. అక్కడ ఉన్న వీర రేవతి (50) అనే మహిళ ఎలాంటి వైద్య విద్యార్హతలు లేకపోయినా, ప్రభుత్వ అనుమతులు లేకపోయినా అబార్షన్ చేయడానికి ముందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. గర్భిణీలను తనకు పరిచయమున్న స్కానింగ్ సెంటర్లకు పంపించి, స్కానింగ్ నివేదికల ఆధారంగా అబార్షన్‌లు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా మహిళా కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.10 వేల నగదు తీసుకుని, కొన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అబార్షన్



చేసేందుకు సిద్ధమవుతుండగా, ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడే ఉన్న పోలీసు బృందం జోక్యం చేసుకుని చర్యలు చేపట్టింది. దీంతో అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఈ సందర్భంగా సెంటర్ లో ఉన్న పలు రికార్డులు, వైద్య సామగ్రి, మందులు, ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అక్రమంగా వైద్య సేవలు అందించడం, గర్భస్రావాల నిర్వహణ, సంబంధిత చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వ అనుమతులు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన వైద్యుల వద్ద మాత్రమే వైద్య సేవలు పొందాలని, ఇలాంటి అనధికారిక కేంద్రాలను ఆశ్రయించి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, అక్రమ వైద్య కేంద్రాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇద్దరిని ఆరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు. హాజరు పరచినట్లు నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపారు.

# తెలంగాణ రాష్ట్రంలోనే జాబ్ ఫ్రాడ్ పేరుతో మోసం చేసిన మహిళ అరెస్ట్

**- గతంలో ప్రధాన నిందితులు ముగ్గురి అరెస్ట్ - అనంత ఈ సొల్యూషన్, విద్యాదాన్ ఎన్జీవో ఆర్గనైజేషన్ పేరుతో నకిలీ జాబ్ ఫ్రాడ్స్**

**- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళపై 20 కేసులు నమోదు. - ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి, పోలీసులకు సమాచారం అందించాలి.**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 13(భారత శక్తి)** ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఏజెంట్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వందల మంది అభ్యర్థులను మోసం చేసిన ముఠా సభ్యులలో ఒకరైన సుజాత ఠాకూర్ ను ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

జిల్లా వ్యాప్తంగా ఈ ముఠా సభ్యులపై 20 కేసులకు పైగా నమోదు అయినట్లు తెలిపారు. ఈ ముఠా లోని ప్రధాన నిందితులను ఈ సంవత్సరం జనవరి 10న అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని, మిగిలిన నిందితులలో ఒకరైన సుజాత ఠాకూర్ ను ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిందితులు 2023 సంవత్సరంలో అనంత ఈ సొల్యూషన్స్ మరియు విద్యాదాన్ ఆర్గనైజేషన్ అనే సొసైటీ ద్వారా విద్యాంజలి 2.0 స్కీం డబ్బులు దుర్వినియోగం చేయాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సి ఎస్ ఆర్ నిధులు కాజేయాలని దురుద్దేశంతో ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని అబద్ధాలు చెప్పి నిరుద్యోగులను నమ్మబలికి నకిలీ ఉద్యోగాలను వివిధ పాఠశాలల్లో మరియు కళాశాలలో వచ్చేలా చేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు.ఈ ముఠా సభ్యులు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఒక్కొక్కరి వద్ద లక్ష నుండి రెండున్నర లక్షల వరకు వసూలు చేసి దాదాపు 240 అభ్యర్థులను మోసం చేయడం జరిగిందని తెలిపారు.ఈ ముఠా సభ్యులకు ఏజెంట్లుగా ఉన్నటువంటి ఆదిలాబాద్ జిల్లాలో సహకరించినటువంటి వారిపై ఇదివరకే పలు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ప్రజల ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి మాటలను నమ్మవద్దని అప్రమత్తంగా వ్యవహరించాలని డబ్బులతో ప్రభుత్వ ఉద్యోగాలు రావని పరీక్షల ద్వారా ఉద్యోగాలను సాధించాలని తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసే వారిపై, ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, నిందితులను ఎట్టి పరిస్థితులను విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు.



# గూడెం గుట్ట ఆలయ అభివృద్ధికి భూమి పూజ

**- 70 కోట్లతో అభివృద్ధి - దేవాలయాల అభివృద్ధికి రూ. 2,216 కోట్లు.**

**- గోదావరి పుష్కరాలకు మరో రూ. వెయ్యి కోట్లు - బాసర టు భద్రాచలం ఆధ్యాత్మిక కారిడార్ రూ. 802 కోట్లతో సుందరీకరణ**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 13 (భారతశక్తి): ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ గడ్డం వంశీ కృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పూర్తయిన మూడేళ్ల సందర్భంగా పిప్పిరిలో నిర్వహించిన సభలో గూడెంగుట్ట ఆలయ అభివృద్ధి పనుల ప్రస్తావన వచ్చిందన్నారు.

ఆ సభ జరిగిన కొన్ని రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈరోజు భూమిపూజ నిర్వహించడం ప్రజాప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.దాదాపు రూ. 70 కోట్ల భారీ నిధులతో గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు.తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేవలం రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను ఆయన వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రాష్ట్రములోని ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 2,216 కోట్లు మంజూరు చేసిందని ఆయన ప్రకటించారు. గతంలో మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు అవసరమైన వసతులు,ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ. 1,000 కోట్లను మంజూరు చేసిందన్నారు.

బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాల అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ. 802 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రజల నమ్మకాలను, వారి కోరికలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవసాయానికి ప్రాణం ఆధ్యాత్మికతతో పాటు ఈ ప్రాంత ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందులో భాగంగా గూడెంగుట్ట పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం) పనుల కోసం రూ. 74 కోట్లు కేటాయించి, ఈరోజు భూమిపూజ చేసుకోవడం శుభపరిణామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఆధ్యాత్మికత మరియు సాగునీటి రంగాల అభివృద్ధికి బహుముఖ వ్యూహంతో ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును భట్టి విక్రమార్క మనస్ఫూర్తిగా అభినందించారు. కేవలం అధికార హోదాను అనుభవించడం కాకుండా, నిరంతరం ప్రజల కోసం సేవ చేయడమే ప్రజాప్రతినిధి బాధ్యత అని ప్రేమ్‌సాగర్ రావు నిరూపిస్తున్నారన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కూడా ప్రేమ్‌సాగర్ రావు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి పనిచేస్తున్నారని కొనియాడారు.

చివరగా, గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి, రాబోయే రోజుల్లో జరిగే ప్రారంభోత్సవ మహోత్సవంలో కూడా మనమందరం ఇదే ఉత్సాహంతో పాల్గొందామని పిలుపునిచ్చారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# హౌసింగ్ అక్రమాలపై ఉక్కుపాదం..!!

**-హౌసింగ్ శాఖ సమీక్ష సమావేశంలో అధికారులకు మంత్రి పార్థసారథి సీరియస్ వార్నింగ్..!**

**-సెప్టెంబర్ నాటికి పెండింగ్ ఇళ్లు పూర్తి చేయాలి -స్వాహా చేసిన నిధుల రికవరీకి చర్యలు.**



ప్రొద్దుటూరు, జూన్ 13(భారత శక్తి ): గతంలో హౌసింగ్ శాఖలో జరిగిన అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు ఆర్‌డబి అతిథి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి జిల్లా హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల పేదలు నష్టపోయారని పేదల కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. జరిగిన ప్రతి అక్రమంపై విచారణ జరిపి స్వాహా చేసిన కోట్ల రూపాయలను తిరిగి రికవరీ చేయాలని మంత్రి ఆదేశించారు. మెప్మా మహిళా సంఘాలు, హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించిన నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం హౌసింగ్ లేఅవుట్లలో ఇంకా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న సెప్టెంబర్--అక్టోబర్ నాటికి పెండింగ్ గృహాలన్నీ పూర్తి చేసి లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉండేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, "ప్రభుత్వం జీతాలు ఇస్తోంది ప్రజలకు సేవ చేయడానికి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడానికి కాదు. ఇకపై నిర్లక్ష్యం, అలసత్వం అస్సలు సహించం. లక్ష్యాలు చేరుకోలేకపోతే ఉద్యోగాలు వదిలి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు తెచ్చుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హ లబ్ధిదారుడు తన ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుందని, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి పేదలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబందిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13: తెలంగాణ గిరిజన సంక్షేమ నివాస డిగ్రీ కళాశాల (బాయ్స్), పెద్దకంజర్లలో 2026--27 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుక్క సునీలా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని ఆధునిక వసతులు ఉచితంగా అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

**అందుబాటులో ఉన్న కోర్సులు:**

బి.ఎస్‌సి:గణితం, భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్
బి జెడ్ సి: బోటనీ , జువాలజీ రసాయన శాస్త్రం
ఎం ఎస్ డి ఎస్ :గణితం, గణాంక శాస్త్రం, డేటా సైన్స్
ఎం ఎస్ సి : గణితం, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్
బి .కాం.కంప్యూటర్ అప్లికేషన్స్,బి.కాం (ఆనర్స్)
- బి.ఏ ( హెచ్ ఈ పి )

**కళాశాల ప్రత్యేకతలు**

అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉచిత నాణ్యమైన బోధన,డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యాధునిక ప్రయోగశాలల సౌకర్యం, ఉచిత వసతి, భోజనం, 24 గంటల భద్రతతో కూడిన నివాస ప్రాంగణం,క్రీడలు, జిమ్ సౌకర్యాలు. పీజీ, క్యాట్, మ్యాట్, జామ్ తదితర ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ,కెరీర్ గైడెన్స్ మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు 24 గంటలపాటు అందుబాటులో వైద్య అధికారి సేవలు ఉంటాయని తెలిపారు.

**అర్హత**

2025 లేదా 2026 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల విద్యార్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.
మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9912834414/9440887833/ 8008070959/ప్రిన్సిపాల్ సుక్క సునీలా మొబైల్: 7702790377 లలో సంప్రదించవచ్చని సూచించారు.

## రాజీతో రాజా మార్గం : ఎస్సై బి. చంద్రశేఖర్




ములుగు జిల్లా ప్రతినిధి,జూన్ 13(భారత శక్తి): జిల్లా కోర్ట్ జాతీయ లోక్ ఆధాలాత్ రాజీతో రాజా మార్గాన్ని ఎంచుకోవచ్చని ములుగు ఎస్సై చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా కోర్టులో ఈనెల 10 నుండి 20 వరకు లోకదాలత్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కోర్టు కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమ మైన రాజా మార్గమని, దీని ద్వారా సమయం వృధా కాకుండా సత్వర న్యాయం కాక్షిదారులకు ఇరువైపులా జరుగుతుందని పేర్కొన్నారు. ములుగు పోలీస్ స్టేషన్ పరుధిలోని కక్షిదారులు నేరుగా పోలీస్ స్టేషన్ ను సంప్రదించవచ్చని, లేదా8712670081, 8712670082 గల మొబైల్ నెంబర్ ల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

## మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

ఎల్బీనగర్, జూన్ 13 (భారత శక్తి): నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించిన ఘటన చోటు చేసుకుంది. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం...సాయినగర్ కాలనీ రోడ్ నంబర్-2లో నివాసముంటున్న పాశం శ్యామల (65) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా ఉదయం 4 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఆమె ఇంటి తలుపు తట్టాడు. నిద్ర మత్తులో ఉన్న శ్యామల తలుపు తెరవగానే ఆ వ్యక్తి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. భర్త మృతి చెందడంతో శ్యామల కింద అంతస్తులో ఒంటరిగా నివసిస్తుండగా, ఆమె కుమారుడు పై అంతస్తులో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డిటేక్టివ్ ఇన్స్పెక్టర్ రుద్వీర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## జూన్ 16న పోర్టర్ ఆఫీసు ముట్టడి

**:ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్**

**-యాజమాన్య నిర్లక్ష్యంపై ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) సమరభేరి**

**-డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తే ఊరుకోం**

**: రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్ బాబు**



ఎల్బీనగర్, జూన్ 13: భారత శక్తి, పోర్టర్ డ్రైవర్ పార్టనర్ల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్య తీరుకు నిరసనగా జూన్ 16న చేపట్టే పోర్టర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ (AIRTWF-CITU) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే. అజయ్ బాబు పిలుపునిచ్చారు. డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తూ, వారి సమస్యలను పట్టించుకోకపోతే యాజమాన్యం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
రంగారెడ్డి జిల్లా చింతలకుంట సెంటర్‌లో శనివారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ పోర్టర్ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 16న జరగబోయే ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**- పార్టనర్ల పేరుతో నిలువు దోపిడీ**

ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ.. పోర్టర్ యాజమాన్యం డ్రైవర్లను 'పార్టనర్స్' (భాగస్వాములు) అని పిలుస్తూ, లాభాల్లో వాటా ఇవ్వకపోగా కనీసం గిట్టుబాటు రేట్లు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రేట్లు పెంచాల్సింది పోయి, డ్రైవర్ల పొట్టకొట్టడం దుర్మార్గమన్నారు. డ్రైవర్ల శ్రమకు తగిన విలువ ఇచ్చి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం తన వైఖరిని మార్చుకోకపోతే డ్రైవర్లందరూ ఏకమై బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**- ప్రభుత్వమే సొంత యాప్ తీసుకురావాలి**

చట్ట ప్రకారం వ్యవహరించకుండా డ్రైవర్లను నిలువు దోపిడీ చేస్తున్న పోర్టర్ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అజయ్ బాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మూగప్రేక్షకుడిలా వ్యవహరించడం సరికాదని, తక్షణమే జోక్యం చేసుకుని ఈ ప్రైవేట్ యాప్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వమే ఒక ప్రత్యేక రవాణా యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**- భారీగా తరలిరావాలని పిలుపు**

ఈ ముట్టడి కార్యక్రమంలో పోర్టర్ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రవాణా రంగ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరహరి, సీఐటీయూ ఎల్బీనగర్ నాయకులు ఎల్లయ్య, శ్రీరాములు, పోర్టర్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారం, వైస్ ప్రెసిడెంట్ మహేష్, సెక్రటరీ సాజిత్, ట్రెజరర్ దేవ, సంఘం నాయకులు వినయ్ గౌడ్, లింగస్వామి, రోహిత్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## బీవీఆర్ఐటీలో విజయవంతంగా ముగిసిన వామ్స్ 2026 అంతర్జాతీయ సదస్సు

**- వృత్తిపరమైన అభివృద్ధికి వేదిక ప్రముఖ శాస్త్రవేత్తలు,పరిశ్రమ నిపుణుల మేధోమదనం**

**- వామ్స్ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు - ఎలక్ట్రానిక్స్ రంగానికి గట్టి పునాది**




మెదక్ జిల్లా నర్సాపూర్,జూన్ 13 (భారత శక్తి న్యూస్,): మెదక్ జిల్లా నర్సాపూర్ లో బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు నిర్వహించిన 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ అంతర్జాతీయ సదస్సు ఐదు రోజుల పాటు విజయవంతంగా ముగిసింది. ఈ అంతర్జాతీయ సదస్సు లో శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమ--విద్యా సంస్థల పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి అంతర్జాతీయ భాగస్వామ్యాలకు వేదికగా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వామ్స్ సలహాదారు డా.సుధాకర్ కె.రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి చక్కని సదుపాయాలు మంచి ఆరోగ్యకరంగా పచ్చని వాతావరణంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరిగేందుకు ప్రోత్సాహం సహాయ సదుపాయాలు కల్పించిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి.విష్ణురాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ఈ సదస్సులో తెలిపారు. వామ్స్ జనరల్ చైర్, బీవీఆర్ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.బి.ఆర్.సంజీవరెడ్డి అధ్యక్షత వహించగా,డా.పి.సతీష్ రామచౌదరి, డా.వి.సమీర్ చక్రవర్తి, బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా.కె.లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

**వామ్స్ ప్రతిష్ఠాత్మక అవార్డులు:**



వామ్స్ సదస్సులో అత్యున్నత గౌరవం గా భావించే డా.సుధాకర్ రావు స్పెషల్ రికగ్నిషన్ అవార్డు" ను రూ.1,00,000 నగదు బహుమతితో ప్రొఫెసర్ సమీర్ చక్రవర్తి వేదుల ప్రొఫెసర్ పి.సతీష్ రామచౌదరిలకు సంయుక్తంగా అందజేశారు. వామ్స్ సదస్సు అభివృద్ధికి ఇంజనీరింగ్ సమాజానికి వారు అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా, రూ.50,000 నగదు బహుమతితో కూడిన డా. సుధాకర్ రావు బెస్ట్ పేపర్ అవార్డు"ను అహ్మదాబాద్‌లోని ఇస్రో-స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ కు చెందిన రోహిత్ నంద్వానీ కి ఆయన అత్యుత్తమ పరిశోధన కృషికి గాను ప్రదానం చేశారు. యాంటెన్నా రూపకల్పన, వైర్లెస్ కమ్యూనికేషన్, రంగాలలో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు డా.సి.జె.రెడ్డి,డా. నాసర్ చాహట్ ,డా.జోనాథన్ సాడర్, నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ, అమెరికాకు చెందిన వారికి ప్రొఫెసర్ లాట్ షఫాయ్, డా.డెస్మండ్ సిమ్, డా. జయశ్రీ కులకర్ణి, డా.జుబైర్ అక్తర్ వారి పరిశోధన రంగాలలో 10 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు నగదు బహుమతి పొందటం జరిగింది. సాంకేతిక ఆవిష్కరణలకు గుర్తింపుగా 60కి పైగా ప్రతిష్ఠాత్మక అవార్డులను సదస్సులో ప్రదానం చేశారు. బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా.కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, పరిశోధనలో నూతన ఒరవడిని ప్రోత్సహించడం, ముఖ్య ఉద్దేశమని తెలియపరిచారు. ప్రిన్సిపాల్ డా.సంజయ్ దూబే మాట్లాడుతూ వామ్స్ ద్వారా బీవీఆర్ఐటీ కి అంతర్జాతీయ గుర్తింపు మరింత పెరిగిందన్నారు. ఈ సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో బీవీఆర్ఐటీ యాజమాన్యం, డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే,అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు, పరిపాలనా సిబ్బంది, మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) శ్రీ బి. బాపిరాజు మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ సురేష్ కీలక పాత్ర పోషించారు. వామ్స్ ని విజయవంతంగా నిర్వహించిన బీవీఆర్ఐటీ యాజమాన్యానికి ఐఈఈఈ యాంటెన్నాస్ అండ్ ప్రాపగేషన్ సొసైటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో జాతీయ అంతర్జాతీయ దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ప్రరిశ్రమ రంగ నిపుణులు,

## భైంసా పట్టణంలో ప్రత్యేక ట్రాఫిక్ తనిఖీలు

**- 54 కేసులు నమోదు.**

**- 16 వాహనాలు స్వాధీనం.**

**-భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, భారత శక్తి, జూన్ 13: జిల్లా ఎస్పీ డా. జానకి శర్మిల ఆదేశాల మేరకు, భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణలో భైంసా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ప్రత్యేక ట్రాఫిక్ అమలు కార్యక్రమం, నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృత తనిఖీలు చేపట్టారు. నాకాబందీ ఏర్పాట్లను అదనపు ఎస్పీ సాయి కిరణ్ ఆకస్మికంగా పరిశీలించి, ట్రాఫిక్ అమలు చర్యలను



సమీక్షించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన బాలల తల్లిదండ్రులకు చట్టపరమైన పరిణామాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన 5 కేసులు, ట్రిపుల్ రైడింగ్‌కు సంబంధించిన 2 కేసులు, నంబర్ ప్లేట్లు లేని 9 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. స్పాట్ చలాన్ల ద్వారా 26 కేసులు నమోదు చేసి రూ.18,500 జరిమానా వసూలు చేయగా, కెమెరా చలాన్ల ద్వారా 15 కేసుల్లో రూ.3,125 వసూలు చేశారు.

మొత్తంగా 54 కేసులు నమోదు చేసి రూ.21,355 జరిమానా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా భైంసా టౌన్ ఎస్‌హెచ్‌వో టి. సాయి కుమార్ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ ధరించాలని, వాహనాలపై చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# రాయలసీమ యూనివర్సిటీ వీసీ, రిజిస్టర్‌పై సమగ్రమైన విచారణ జరిపించాలి

**- యూనివర్సిటీలో వారు చేసిన దోపిడీపై ప్రశ్నించినందుకు విద్యార్థి సంఘాల నాయకులు పై కేసుల..?**

**- త్వరలో వీసీ మరియు రిజిస్టర్ అవినీతి పై విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తాం**

**- ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది డిమాండ్**

**ఎమ్మిగనూరు(భారత శక్తి)** ఎమ్మిగనూరు పట్టణంలో రాయలసీమ యూనివర్సిటీ లో అవినీతి అక్రమాలు పాల్పడుతున్న వీసీ మరియు రిజిస్టర్ పై సమగ్రమైన విచారణ జరిపించి ఆర్పీఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మరియు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ పై పెట్టిన కేసులా ను ఎత్తివేయాలని ఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ లో గత కొన్ని నెలలు గా వీసీ మరియు రిజిస్టర్ చేస్తున్న అవినీతి అక్రమాలపై ప్రశ్నించినందుకు ఆర్ పి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పై వీసీ కేసులు పెట్టడం జరిగింది అలాగే ఇతర విద్యార్థి సంఘాలను యూనివర్సిటీ నుంచి తొలగించడం సిగ్గుచేటు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు . గత నెలలో వీసీ, రిజిస్టర్ అక్రమాలు పై జిల్లా మంత్రివర్యులు టీజీ భరత్ గారికి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది ఈ విషయంపై స్పందించిన మంత్రిగారు వెంటనే రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ డిజిపి గారికి మంత్రిగారి లెటర్ నుండి సిఫారసు లేఖ రాయడం జరిగింది . అయ్యా రాయలసీమ యూనివర్సిటీ వీసీ, రిజిస్టర్ గారికి మీకు సూటిగా కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాము డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు స్పెషల్ సప్లి నిర్వహించండి

అనేది నేరమాయూనివర్సిటీలో చదువుతున్న ఒక విద్యార్థికి అగ్నివీర్ లో ఉద్యోగం వచ్చిందని అందుకు బోనఫైడ్ కావాలని అడుగగా ఇవ్వం అన్నందుకు ఎందుకు ఇవ్వరు అన్నందుకు నేరమా యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విద్యాశాఖ మంత్రి గారికి వివరిస్తాం అని తెలపడం నేరమా తరచూ యూనివర్సిటీ వ్యవహారం పేపర్లలో వస్తుంది అవినీతి అక్రమాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న రిజిస్టర్ను తన మాతృ సంస్థకు పంపండి అని అడగడం నేరమాయూనివర్సిటీలో నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయి దీనిపై విచారణ చేయండి అని చెప్పడం తప్పప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది సార్ ఆలోచించండి అని అడగడం నేరమైందా అంటూ అదే విధంగా కొంతమంది అవినీతి అధికారులు మళ్ళీ తప్పుదోవ పట్టిస్తున్నారు సార్ వీటన్నింటిపై ప్రభుత్వం నికి తెలపడంతో పాటు మంత్రిగారికి వివరిస్తాం అంటుంటే సెక్యూరిటీతో గెంటేంచడం ఎంతవరకు న్యాయమని ఆలోచించాలని అంటే ఇది నేరమాఇప్పటికి అయినా ఈ విషయం పై ప్రభుత్వం స్పందించకపోతే ఇతర విద్యార్థి సంఘాలను యువజన సంఘాలను కలుపుకొని రాయలసీమ యూనివర్సిటీ ముట్టడించి వాస్తవాలు బయటపెడతామని తెలియజేస్తున్నాం. యూనివర్సిటీలో వీసీ మరియు రిజిస్టర్ అవినీతి అక్రమాలపై విద్య శాఖ మంత్రి నారా లోకేష్ మరియు గవర్నర్ గారికి ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు నర్సింహా నాయుడు, మహబూబ్, లక్ష్మన్న, షైక్ష వలి తదితరులు పాల్గొన్నారు

# 59 నియోజకవర్గాలు రెండు భాగాలు

**- 111 నియోజకవర్గాలు మూడు భాగాలు**

**- సౌత్ లో పెరగనున్న 170 స్థానాలు**

**హైదరాబాద్,** దక్షిణది రాష్ట్రాలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గుడ్ న్యూస్ చెప్పారు. కొంతకాలంగా కొంతమంది రాజకీయ నాయకులు దక్షిణాది మీద అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కెసిఆర్ నుంచి మొదలు పెడితే రేవంత్ రెడ్డి వరకు దక్షిణాది రాష్ట్రాలను నరేంద్ర మోడీ పట్టించుకోవడంలేదని.. పార్లమెంటు స్థానాల పెంపు విషయంలో కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే దీనిపై బీజేపీ సరిగా కౌంటర్ ఇవ్వలేకపోయింది. ఇప్పుడు బిజెపి తీసుకొచ్చిన ప్లాన్ ఆ తరహా నాయకుల నోర్లు మూసే విధంగా ఉంది.గతంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం తేలిపోయింది. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపకపోవడంతో ఆ అంశంలో కేంద్ర ప్రభుత్వం విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు అంచనాలకు మించిన బలాన్ని సొంతం చేసుకున్న తర్వాత కేంద్రం మరొకసారి డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తీసుకొస్తుంది. మన దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పెంచాలని కేంద్రం భావిస్తున్నది. దీనివల్ల ప్రజలకు మరింత సమర్థవంతమైన పరిపాలన లభిస్తుందని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే పార్లమెంటు స్థానాల పెంపు విషయాన్ని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది. కీలకమైన ప్రతిపాదనలను అందించిందిజనాభా పెరిగినప్పుడు ఖచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన సాధ్యమవుతుంది.నియోజకవర్గాల పెంపునకు పెరిగిన జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుత జనాభా నివేదికలో పట్టణీకరణ.. ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రధాని ఆర్థిక సలహా మండలి సూచించింది. దీనివల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు పరిపాలన మరింత చేరువవుతుందని.. ఆ ప్రజలకు ప్రతినిధులుగా ఎంపీలు ఉంటారని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది..ఇక దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. కొత్త ప్రతిపాదనలను కేంద్రం అమలు చేస్తే వాటి సంఖ్య 824కు చేరుకునే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాలలో సీట్ల పెంపు ఏకంగా 50% వరకు ఉంటుంది. చిన్న రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న స్థానాలను రెట్టింపు చేస్తారని సమాచారం. దీనివల్ల ఎంపీలు ప్రజలకు మరింత చేరువగా ఉంటారని తెలుస్తోంది.. ప్రధాని ఆర్థిక మండలి నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 170 పార్లమెంట్ నియోజకవర్గాలను పునర్విభజిస్తారు. ఇందులో 59 నియోజకవర్గాలు రెండు భాగాలవుతాయి. 111 నియోజకవర్గాలు మూడు భాగాలవు తాయి. దీనివల్ల ప్రజలకు ఎంపీలు మరింత దగ్గరవుతారు. సమస్యలను నేరుగా పరిష్కరిస్తారు.నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో అదిరిపోయే కానుక ఇచ్చే అవకాశం ఉంది. కేరళ రాష్ట్రంలో ప్రస్తుతం 20 స్థానాలు ఉండగా.. అవి 30 కి పెరుగుతాయి. తమిళనాడులో 39 నుంచి 59.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కూడా స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇక మన దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటు స్థానాలు 120కి పెరిగే అవకాశం ఉంది. అక్కడ దాదాపు 80 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి.కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజల ప్రాతినిధ్యం మెరుగుపడుతుంది. అంతేకాదు ఓటింగ్ కూడా 2.3 శాతం వరకు పెరుగుతుంది. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా మహిళల కోసం పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2027 జనాభా లెక్కల తర్వాతనే చేపట్టాలని కమిటీ ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజన పూర్తయితే దేశంలో రాజకీయంగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## సోషల్ మీడియాలో అసత్య, ద్వేషపూరిత

# పోస్టులు చేసిన వ్యక్తి అరెస్ట్

**- నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 13 (భారత శక్తి) నిర్మల్ పట్టణానికి చెందిన అంబేకార్ వర ప్రసాద్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికల ద్వారా కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, ప్రభుత్వ పథకాలపై అసత్య, ద్వేషపూరిత,రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేస్తూ వైరల్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.పిర్యాదుదారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, నిందితుడు వివిధ రాజకీయ వర్గాల మధ్య విద్వేషాలు, శత్రుత్వాలు పెరిగేలా, ప్రజల్లో అపోహలు సృష్టించేలా, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు నిర్ధారణ అయింది.దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, అనంతరం రిమాండ్‌కు తరలించడమైనది.ఈ సందర్భంగా కేసు ఛేదనలో కృషి చేసిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సమ్మయ్యను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ అభినందించారు.

# రాయలసీమలో లిమిటేషన్ రచ్చ

**తిరుపతి(భారత శక్తి)** మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వెనక్కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది కేంద్రం. అయితే ఎట్టి పరిస్థితుల్లో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గ రాజకీయ పరిస్థితులు కలిసి వస్తున్నాయి. బెంగాల్ తో పాటు తమిళనాడులో లోక్సభ సభ్యుల బలం ఎన్డీఏకు అదనపు బలంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నిన్ననే తాజా వర్కింగ్ పేపర్ నియోజకవర్గాల పునర్విభజనపై విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలు పెరగడంతో పాటు ఏపీలో కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఉన్న 25 పార్లమెంట్ స్థానాలకు గాను మరో పదమూడు సీట్లు పెరుగుతాయి. అయితే సింహభాగం పెరుగుదల అనేది రాయలసీమలో కావడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.కొంతకాలంగా తీవ్ర అధ్యయనం చేసిన ఈ ఆర్థిక మండలి తన నివేదికను బయటపెట్టింది. కొత్త ప్రతిపాదనలను పెట్టింది. వీటిని చూస్తే పునర్విభజనతో ఎక్కువగా లాభపడేది రాయలసీమ. అత్యంత ప్రతిష్టాత్మకమైన లోక్ సభ స్థానాలుగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, రాజంపేట నియోజకవర్గాల పరిధి చాలా పెద్దదిగా ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానాన్ని మూడు గా విభజిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అభిప్రాయపడింది. ఈ నాలుగు సీట్ల పరిధిలో మరో 8 పెరగనున్నాయన్నమాట. ఇదే జరిగితే భవిష్యత్తులో దేశ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అధికార పీఠాన్ని శాసించడంలో రాయలసీమ విపరీతమైన ప్రభావం చూపి అవకాశం ఉంది.రాయలసీమలో పునర్విభజనతో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉత్తరాంధ్రలో మాత్రం కేవలం రెండు లోక్ సభ సీట్లు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. విశాఖ గ్లోబల్ సిటీగా మారుతున్న తరుణంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని ఈ మండలి ప్రతిపాదించింది. అంటే విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న పార్లమెంట్ స్థానాలను యధాతథంగా ఉంచి.. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఓ రెండు స్థానాలను విభజించి పెంచుతారు అనేది ఈ ప్రతిపాదనల సారాంశం. అయితే ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా, రాజకీయ ప్రాధాన్యత కలిగిన కోస్తాంధ్ర, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రం ఇప్పుడున్న సీట్లను యధాతథంగా ఉంచాలని ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. కోస్తా జిల్లాల్లో జనాభా నియంత్రణ ప్రమాణాలు స్థిరంగా ఉండటం, నియోజకవర్గాల భౌగోళిక పరిమితులు ఓటర్ల సంఖ్యకు అనుకూలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2027 జనాభా లెక్కల ప్రకారం ఈ పునర్విభజన చేపడితే రాజకీయంగా రాయలసీమ మరోసారి పై చేయి సాధించే అవకాశం ఉంది. దాదాపు 13 పార్లమెంటు స్థానాలు పెరగడంతో అన్ని పార్టీల్లో ఆశావహులకు అవకాశాలు దక్కుతాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫీల్ గుడ్ సరే...వీటి సంగతేంటీ...

**విజయవాడ, (భారత శక్తి)**అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీలో విపరీతమైన నిరాశ కనిపిస్తోంది. అందువల్లే ఏ మాత్రం అవకాశం దొరికినా సరే వదిలిపెట్టకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జరిగింది ఇసుకంత అయితే.. దానిని పెద్ద బండరాయి లాగా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇది కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇటువంటి లోపాల మీద కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అభివృద్ధి, సంక్షేమం అని చెబుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా వీటి మీద దృష్టి పెట్టాలి. అన్ని రకాలుగా పింఛన్లను భారీగా పెంచామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రెండు సంవత్సరాల కాలంలో ఇంతవరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. గృహాలను కూడా నిర్మించలేదు. నాడు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. వారిపై ఇంతవరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రీసర్వే సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. క్వాంటం వ్యాలీ.. డేటా సెంటర్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సామాన్యులకు ఏ విధమైన ఉపయోగం లభిస్తుందో వివరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉన్నది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు ఆలస్యం అయ్యేవి. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు కూడా సరిగా వచ్చేవి కాదు. పిఆర్సి అమల్లో జగన్ ప్రభుత్వం మొండిగా ఉండేది. చివరికి సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ వెనుకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల విషయంలో సానుకూల ధోరణితో కనిపిస్తోంది. వేల కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉద్యోగుల సమస్యల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం ఇంకా వేగం పెంచాల్సి ఉంది. కొన్ని విషయాల పట్ల పాఠాలు నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ భవనాలు.. సముదాయాల నిర్మాణం మీదనే ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పబ్లిక్ యాక్టివిటీ లో వేగం పెరగాలంటే కచ్చితంగా లే అవుట్లు డెవలప్ కావాలి. అవి లేకుండా అమరావతిలో ఎవరు కూడా ఇల్లు కట్టుకునే సాహసం చేయరు. వ్యాపారాలు ప్రారంభించలేరు.వైసీపీ పరిపాలనలో ఏపీ రాష్ట్రంలో ఆర్థిక లోటు పెరిగిపోయింది. సంక్షేమ పథకాలకు మాత్రమే నిధుల సర్దుబాటు జరుగుతోంది. అభివృద్ధి పనుల విషయంలో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. అప్పుల మీదనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అప్పుల భారం పెరిగిపోతుంది. వీటివల్ల కీలకమైన పథకాల అమలు సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పథకానికి నిధుల సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అలానే కొనసాగుతోంది. పొలిటికల్ గవర్నెన్స్ ను అమలు చేయాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదు. కన్సల్టెంట్లు ప్రభుత్వంలో హవా కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్లు చెప్పిన మాటనే ప్రభుత్వం పాటిస్తోంది.. కొన్ని సందర్భాలలో కన్సల్టెంట్లు చెప్పినట్టుగానే చంద్రబాబు చేయాల్సి వస్తుంది. దీనివల్ల సోషల్ మీడియాలో విష ప్రచారం జరుగుతోంది.సూపర్ సిక్స్ పథకాలలో ఇంకా రెండు అమలు కావడం లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు.. ఇది సాధికాకపోతే నెలకు 3000 నిరుద్యోగ భృతి.. ప్రతినెల మహిళకు 1500 రూపాయల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఇక మిగతా పథకాలు తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం 2.. స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి.కొంతమంది నేతలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. పోలీస్ విధుల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు. వారి వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది.. ఎమ్మెల్యేలు వ్యవహార శైలి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇలా చేసి వైసిపి ప్రజల నుంచి ఎలాంటి ఫలితాన్ని ఎదుర్కొన్నదో అందరూ చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి అటువంటి పరిస్థితి రాకూడదంటే నేతలు జాగ్రత్తగా ఉండడం చాలా మంచిది

## మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని

# అరెస్ట్ చేసిన పోలీసులు

**వికారాబాద్ (భారత శక్తి)**వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ రైతులకు మద్దతుగా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, పోలీసులు రంగాపూర్ చౌరస్తాలో అరెస్ట్ చేసారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇవ్వమని గ్రామ సర్పంచ్, రైతులు అమరణ నిరాహారదీక్షకు దిగారు. ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రైతులను పరామర్శించేందుకు వెళుతుండగా మహేష్ రెడ్డిని పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసారు. పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు.

# అగ్రికల్చర్ లోహాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానం..

**అనంతపురం,(భారత శక్తి)** ఉమ్మడి అనంతపురం జిల్లా.. కరవుకు కేరాఫ్ అడ్రస్.. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. ఏళ్ల తరబడి కరువు కాటకాలు వేధిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, భూమాతపై నమ్మకంతో వ్యవసాయాన్నే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేసే రైతన్నలు ఎందరో. కానీ కాలం మారుతోంది. అనంత రైతులు టెక్నాలజీ బాట పడుతున్నారు. మూస ధోరణి వీడి.. సరికొత్త సాంకేతిక పద్ధతులతో సాగులో అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ విధానాలను పక్కనబెట్టి హార్టీకల్చర్, పండ్ల తోటల సాగులో రాణిస్తున్నారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానాన్ని ఎక్కువగా ఆఫ్రికా దేశాలలో ఉపయోగిస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఈ విధానం ద్వారా వ్యవసాయం చేపడుతుంటారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ అంటే.. కొండకు వాలుగా ఉన్న పొలాలలో అర్ధ చంద్రాకారపు ఆకారంలో గుంతలు తవ్వడం. సాధారణంగా ఈ గుంతలు ఒకటి నుంచి రెండు మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. అలాగే నేల సారవంతాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు భారీగా పెట్టుబడులు లేకుండానే బీడు భూములను పునరుద్ధరించుకోవచ్చు. ఇలా కొండకు వాలుగా గుంతలు తవ్వటం ద్వారా వర్షం కురిసినప్పుడు ఆ వర్షపు నీరు వీటిలో చేరి అక్కడే ఇంకిపోతుంది. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ విధానం అనుసరిస్తుంటారు.అలాంటి ఓ రైతే ప్రమీలమ్మ. ఆఫ్రికా దేశంలో అనుసరించే హాఫ్‌మూన్ విధానంతో గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తూ రోజువారీ ఆదాయం పొందుతున్నారామె. తన సక్సెస్ స్టోరీతో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి కూడా అభినందనలు అందుకున్నారు ప్రమీలమ్మ.కళ్యాణదుర్గం మండలంలోని భట్టువానిపల్లికి చెందిన ప్రమీలమ్మకు మూడు ఎకరాల పొలం ఉంది. అర ఎకరంలో ఏ - గ్రేడ్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు ప్రమీలమ్మ. మిగతా రెండున్నర ఎకరాలలో వేరుసెనగ పంట పండిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తూ రసాయనాలకు దూరంగా సొంతంగా తయారుచేసుకున్న జీవామృతాన్ని పిచికారీ చేస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఏ గ్రేడ్ విధానంలో సాగుచేసే ఆకుకూరలు, కూరగాయలతో రోజూ ఆదాయం పొందుతున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తూ ఉండటంతో ప్రమీలమ్మ ఇంటివద్దకే వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రమీలమ్మ గురించి తెలిసిన సీఎం చంద్రబాబు జలహారతి కార్యక్రమంలో ఆమెను అభినందించారు.ఏ గ్రేడ్ సాగు అనేది ప్రకృతి వ్యవసాయంలో ఒక పద్ధతి. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో, ఒకే సమయంలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒకే పొలంలో, ఒకే సమయంలో ప్రధాన పంటతో పాటుగా అనుబంధంగా మరో మూడు లేదా నాలుగు పంటలు సాగు చేయడాన్ని ఏ గ్రేడ్ మోడల్ అని పిలుస్తుంటారు. ఈ రకంగా వివిధ రకాల పంటలను పండించటం ద్వారా నేల సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. అలాగే అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే రోజూవారీ ఆదాయం కూడా పొందవచ్చని చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ మధ్యకాలంలో ఈ విధానం పెరుగుతోంది.

# డేటా సెంటర్లు...

## 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ కు ప్లానింగ్

**విశాఖపట్టణం,(భారత శక్తి)** ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036-37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్‌వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్‌ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్‌ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్‌వాల్ట్, సీటీఆర్ఎల్ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# జగన్‌కు పాజిటివ్‌గా మారుతోందా..

**విజయవాడ,(భారత శక్తి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. అది వచ్చే ఎన్నికల్లోనూ చెక్కు చెదరదన్న నమ్మకంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. దీంతో పాటు తమకు అదనంగా మరికొంత బలం తోడవుతుందని, తద్వారా తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. అందుకే అధికార పక్షంపై జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. నేరుగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ లపైన కూడా విమర్శలు చేస్తూ పాలనలో లోటుపాట్లను మీడియా సమావేశాల ద్వారా బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనకు దూరమైన వర్గాలు తిరిగి తన చెంతకు చేరతాయని నమ్ముతున్నారు.గత ఎన్నికల్లో మధ్యతరగతి ప్రజలతో పాటు, రెడ్డి సామాజికవర్గంలోనూ ఓట్లు చీలిపోయాయి. ఉన్నత వర్గాల ఓట్లు ఎటూ రాలేదు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డం తిరిగారు. తమపై పనిభారం మోపడంతో పాటు తమకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం, ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 90 శాతం మందికిపైగా నాటి ఎన్నికల్లో కూటమి వైపునకు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు తనకు దూరమైన అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఉందని జగన్ భావిస్తున్నారు. ఈ అదనపు బలం దాదాపు పదిశాతం ఓట్లు తనకు యాడ్ అవుతాయని తన సన్నిహితుల వద్ద లెక్కలు చెబుతున్నారని తెలిసిందిగత ఎన్నికల్లో తన సొంత సామాజికవర్గం లో కూడా అసంతృప్తి ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. రెడ్డి సామాజికవర్గంలో జగన్ పాట్ల సానుభూతి వచ్చిందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గత ప్రభుత్వమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారని జగన్ భావిస్తున్నారు. అందుకే ఈ సారి ఎన్నిలకు ముందు జగన్ కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి జగన్ హామీలు కూడా భారీగా ఉంటాయని అంటున్నారు.

# 97 శాతం తగ్గిన మొబైల్ డేటా చార్జీలు

**హైదరాబాద్,(భారత శక్తి)** పెట్రోల్ ధరలు పెరిగాయని, డీజిల్ ధరలు పెరిగాయిని, గ్యాస్ ధరలు పెరిగాయని, కంరెటు చార్జీలు పెరిగాయని, బస్సు చార్జీలు పెరిగాయని వామపక్ష పార్టీలు, విపక్షాలు ఆందోళనలు చేయడం సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రో, గ్యాస్ ధరలపైనే విపక్షాలు ఎక్కువగా ఆందోళన చేశాయి. అయితే ధరలు తగ్గినప్పుడు మాత్రం ఎవరూ స్వాగతించరు. అయితే రోజురోజుకు అన్నింటి ధరలు పెరుగుతున్నాయి. కానీ 12 ఏళ్లలో అనూహ్యంగా ఒకదాని ధర 97 శాతం తగ్గింది. అందరికీ అందుబాటులోకి వచ్చింది. అందే మొబైల్ డేటా.కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రంగంలో సాధించిన అపూర్వ విజయాన్ని వెల్లడించింది. 2014లో 1 గిగాబైట్(జీబీ) డేటా ధర రూ.269 ఉంటే, ప్రస్తుతం అది కేవలం రూ.9.2కి తగ్గింది. అంటే గత 4,399 రోజుల్లో (సుమారు 12 ఏళ్లలో) డేటా ధరలో 97 శాతం తగ్గుదల నమోదైంది.ఇది భారత్ డిజిటల్ చరిత్రలో ఒక మైలురాయి. ఈ అద్భుత మార్పు వెనుక కేంద్ర ప్రభుత్వం నిరంతరం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం, భారత్‌నెట్ ప్రాజెక్ట్, ఆప్టికల్ ఫైబర్ విస్తరణ, పోటీతత్వం ప్రోత్సాహం, 2016లో రిలయన్స్ జియో ప్రవేశం వంటి అనేక అంశాలు కలిసి ఈ ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడం, స్పెక్ట్రం అలాట్‌మెంట్‌లో పారదర్శకత, 5జీ సేవల వేగవంతమైన రోల్‌అవుట్ వంటి చర్యలు డేటా సరఫరాను భారీగా పెంచి, ధరలను తగ్గించాయి.

# ఏపీ లిక్కర్ రవాణా కుంభకోణం

## - లగ్జరీ కారు, రోలెక్స్ వాచీలు స్వాధీనం

**విజయవాడ (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణానికి అనుబంధంగా జరిగిన మద్యం రవాణా టెండర్ల స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో కీలక ఆధారాలు లభించాయి. గురువారం నిర్వహించిన ఈ దాడుల్లో ఒక లగ్జరీ కారుతో పాటు రూ. 94.5 లక్షల విలువైన ఖరీదైన గడియారాలు, లెక్కల్లో చూపని నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈడీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేశిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కేశిరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, విజయ నరసింహారెడ్డి, వల్లు సందీప్, కరుమూరి నాగేశ్వరరావు, కరుమూరి సునీల్ కుమార్‌లకు చెందిన ఐదు ప్రాంగణాల్లో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద జాయింట్ వెంచర్ ఒప్పందాలు, లెక్కల్లో చూపని నగదు లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లు తదితర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు రాజ్ కేశిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) మాజీ మేనేజింగ్ డైరెక్టర్ వాసుదేవ రెడ్డిని ఈడీ అరెస్టు చేసింది. వారిని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టులో హాజరుపరచగా, జూన్ 25 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కుంభకోణానికి రాజ్ కేశిరెడ్డి ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు ఈడీ గుర్తించింది. ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా ఉన్న సమయంలో తన రాజకీయ, పరిపాలనా ప్రభావాన్ని ఉపయోగించి, అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవ రెడ్డి, అతని సన్నిహితుడు తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి మద్యం రవాణా టెండర్ల విధానాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారని ఆరోపించింది. ఈ కేసులో ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అదనపు ప్రధాన కార్యదర్శి (విజిలెన్స్) ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో ప్రభుత్వ ఖజానాకు రూ. 195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మద్యం రవాణా టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఎస్‌సీఎస్‌పీఎల్), అనంతరం ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు అనుకూలంగా రూపొందించినట్లు ఈడీ గుర్తించింది. ఈ సంస్థలు కేవలం నామమాత్రంగానే పనిచేయగా, వాస్తవ ఆర్థిక, నిర్వహణ నియంత్రణ మాత్రం రాజ్ కేశిరెడ్డి, వాసుదేవ రెడ్డి అనుచరుల చేతుల్లోనే ఉన్నట్లు పేర్కొంది. డిపోల నుంచి రిటైల్ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా వ్యవస్థను ఉపయోగించి అక్రమ లాభాలు ఆర్జించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. రాజ్ కేశిరెడ్డి, తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి, అంజని కుమార్‌లు వాసుదేవ రెడ్డి సహకారంతో సాధారణ మార్కెట్ రేట్ల కంటే అధిక ధరలకు రవాణా టెండర్లు పొందేలా వ్యవహరించి, నేరపూరిత ఆదాయాన్ని సృష్టించినట్లు ఈడీ ఆరోపించింది. టెండర్ ప్రక్రియలో పాల్గొని కాంట్రాక్టును దక్కించుకోవడానికి ఎస్ఎస్‌సీఎస్‌పీఎల్‌ను ముందస్తు సంస్థగా ఉపయోగించారని, అయితే రవాణా పనుల అసలు నిర్వహణ కిరణ్ కుమార్ రెడ్డి, అతని అనుచరుల చేతుల్లోనే ఉండేదని, వారంతా రాజ్ కేశిరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేసినట్లు ఈడీ దర్యాప్తులో తేలిందని వెల్లడించింది.

# అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**తిరుపతి(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదం

## - చికిత్స పొందుతూ కార్మికుడు సూరిబాబు మృతి

**విశాఖపట్టణం(భారత శక్తి)** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో చోటుచేసుకున్న పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, గత కొన్ని రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న కాంట్రాక్ట్ కార్మికుడు సూరిబాబు శనివారం కన్నుమూశారు. నగరంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. సూరిబాబు మరణంతో ఈ దారుణ ఉదంతంలో మృతి చెందిన వారి మొత్తం సంఖ్య పదికి చేరింది. మరణించిన సూరిబాబు కుటుంబం పెదగంట్యాడ మండలం సీతానగరం గ్రామంలో నివాసం ఉంటోంది. ఆయనకు భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు లోకేష్, ప్రమీల ఉన్నారు. ఆప్యాయంగా చూసుకునే తండ్రి, ఇల్లాలికి కొండంత అండగా ఉండే భర్త.. కేవలం ప్లాంట్ యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే దూరమయ్యాడంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతున్న యజమానిని కోల్పోవడంతో ఆ కుటుంబం అనాథగా మారింది. బాధిత కుటుంబాలకు ప్రస్తుతం వారు నివసిస్తున్న పట్టణంలోనే శాశ్వత నివాసం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బాధిత కుటుంబాల పిల్లలందరికీ ఉచిత విద్యను అందిస్తారు. ప్రతి బాధిత కుటుంబం నుండి ఒకరికి పర్మినెంట్ జాబ్ ఇస్తారు. ఇది రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సైతం వర్తిస్తుంది. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించి కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటించారు. ప్రధానమంత్రి సహాయ నిధి ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 అందిస్తాం. ఇన్సూరెన్స్, ఇతర ప్రయోజనాలతో కలిపి, బాధిత కుటుంబాలకు సుమారు రూ. 38 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుందని' కుమారస్వామి అన్నారు. మొత్తంగా కోటి 72 లక్షల మేర ప్రయోజనాలు అందుతాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్ షాప్ లో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. కార్మికులు పని చేస్తున్న సమయంలో సుమారు 150 టన్నుల ద్రవపు ఉక్కుతో ఉన్న లాడిల్ ఒక్కసారిగా పేలిపోయింది. దాదాపు 1,540 డిగ్రీల వేడితో మరుగుతున్న ఉక్కు ద్రవం కార్మికులపై పడటంతో 8 మంది అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన మరో ఆరుగురు కార్మికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఊహకందని ఈ దుర్ఘటన స్టీల్ ప్లాంట్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఇప్పటికే 22 మంది అధికారుల్ని సస్పెండ్ చేశారు.

# ఒక చదరనపు మీటరుకు రూ.3,684

## - లెక్కలతో మంత్రి నారాయణ

**విజయవాడ,(భారత శక్తి)** అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ హోమ్స్ నిర్మాణ వ్యయం కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల కంటే తక్కువగా ఉందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. శనివారం అమరావతిలో పర్యటించిన ఆయన కొండవీటి వాగు, పాలవాగుపై జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న మంత్రి... ఆయన వ్యాఖ్యలు కౌంటర్ ఇచ్చారు. గెజిటెడ్ అధికారుల నివాసాల టెండర్ రూ.1,003 కోట్లకు, చదరపు అడుగుకు రూ.3,684 చొప్పున కేటాయించబడిందని చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ టెండర్ రూ.1,234 కోట్లకు, చదరపు అడుగుకు రూ.3,945 చొప్పున అమలవుతోందని వివరించారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ మొత్తం 69 వంతెనలను నిర్మిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇందులో ప్రధాన వాగులపై 43 వంతెనలు, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లేఅవుట్లలో మరో 26 వంతెనలు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. వంతెనల సమీపంలో పేరుకుపోయిన మట్టి, తాత్కాలిక కట్టలు, ఇతర అడ్డంకులను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే అదనపు జేసీబీలను వినియోగించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాదిలోగా 69 వంతెనల్లో అధిక భాగం పూర్తవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని ప్రతిపక్ష నేతలకు సూచించిన ఆయన, ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తమ్ముడిపై అన్న కేసులు

## - బెజవాడలో కేశినేని ఫ్యామిలీలో రచ్చ

**విజయవాడ,(భారత శక్తి)** బెజవాడ రాజకీయాల్లో 'కేశినేని సోదరుల' మధ్య ఉన్న విభేదాలు మరోసారి పోలీస్ స్టేషన్ మెట్లెక్కాయి. సోషల్ మీడియా వేదికగా తనపై అసత్య ప్రచారాలు చేస్తూ, తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారంటూ విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని చిన్ని.. తన సొంత అన్న, మాజీ ఎంపీ, వైసీపీ నేత కేశినేని నానిపై విజయవాడలోని పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్ని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేశినేని నానిపై బీఎన్ఎస్ (ఃఔా), ఐటీ యాక్ట్ (మి ంఃబి) కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కేశినేని చిన్ని తన ఫిర్యాదులో పేర్కొన్నదాని ప్రకారం.. 2025 ఏప్రిల్ 22న కేశినేని నాని సోషల్ మీడియాలో ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. అందులో 'ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ పేరుతో ఎంపీ చిన్ని అక్రమంగా లబ్ధి పొందుతున్నారని, బినామీల పేర్లతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ దుష్ప్రచారంపై గతంలోనే తాను లీగల్ నోటీసులు పంపినప్పటికీ, నాని నుంచి ఎలాంటి సమాధానం రాలేదని.. పైగా తనపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూనే ఉన్నారని చిన్ని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చిన్ని ఫిర్యాదును స్వీకరించిన పటమట పోలీసులు... కేశినేని నానిపై భారతీయ న్యాయ సంహిత (ఃఔా) సెక్షన్లు 204, 351, 352, 353, 356, 61 .... ఐటీ యాక్ట్ (మి ంఃబి) సెక్షన్లు 66, 66(అ), 66(ఆ), 67, 72 కింద కేసు నమోదు చేశారు. కేశినేని సోదరుల మధ్య గత కొంతకాలంగా ఆస్తులు, వ్యాపారాలు, బినామీల వ్యవహారాలపై లోపల నడుస్తున్న అంతర్గత యుద్ధం... 2024 సార్వత్రిక ఎన్నికలతో పూర్తిగా రోడ్డున పడింది. గత ఎన్నికల్లో తమ్ముడు కేశినేని చిన్ని తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయగా, అన్న కేశినేని నాని వైసీపీ తరపున నిలబడ్డారు. ఆ ఎన్నికల్లో చిన్ని చేతిలో నాని ఘోర పరాజయం పాలైన తర్వాత ఈ రాజకీయ, కుటుంబ ఈక్వేషన్స్ మరింత దెబ్బతిన్నాయి. ప్రస్తుతం పటమట పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు ముమ్మరం చేశారు. సోషల్ మీడియా పోస్టుల ఆధారాలు సేకరిస్తున్నారు. విజయవాడ రాజకీయాల్లో ఈ అన్నదమ్ముల సవాల్ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# ఎస్ ఐ ఆర్ రాజకీయ పార్టీల సహకారం కోరిన సీఈఓ

**హైదరాబాద్, (భారత శక్తి)** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా, జాబితాలోని అవకతవకలను తొలగించి, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో, జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ విధివిధానాలను వివిధ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వంటి వివిధ దశల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వేను నిర్వహిస్తారు. అనంతరం స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అభ్యంతరాలు, విజ్ఞప్తుల స్వీకరణ ప్రక్రియ అనంతరం, పూర్తిస్థాయి పరిశీలన పూర్తి చేసి అక్టోబర్ 1న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. గత రెండు దశాబ్దాలలో రాష్ట్రంలో ఇంతటి సమగ్ర స్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగడం ఇదే మొదటిసారి. నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారిన వారిని జాబితా నుంచి తొలగించడంతో పాటు, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడమే ఈ ప్రత్యేక సవరణ ముఖ్య ఉద్దేశం. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి విచారణ జరపకుండా ఏ ఒక్కరి పేర్లను జాబితా నుంచి తొలగించబోమని, ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని అధికారులు భరోసా ఇచ్చారు. పౌరుల సందేహాల నివృత్తికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది: రేవంత్ రెడ్డిజనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని, పవన్ కల్యాణ్‌కు కూడా అదే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు. ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# జిల్లాలో 42 మంది బాల కార్మికులను పనిలో నుండి మరియు పోలీసు అధికారుల సహకారంతో బాల కార్మికులను రక్షించిన రూరల్ డెవలప్మెంట్ సొసైటీ




**వనపర్తి (భారత శక్తి)** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కలిసి నలభై రెండు మంది బాలలను బాల కార్మికత్వం నుండి రక్షించింది. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, ( రూరల్ డెవలప్మెంట్ సొసైటీ) జిల్లా పరిపాలన మరియు పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని నేడు నలభై రెండు మంది బాలలను బాల కార్మికత్వం నుండి రక్షించింది. బాల కార్మికత్వ నిర్మూలన కోసం జూన్ నెలను 'యాక్షన్ మంత్'గా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలు, సంస్థలకు ఇచ్చిన ఆదేశాల మేరకు బాల కార్మికత్వం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు మరియు రక్షణ చర్యలు చేపట్టబడ్డాయి. ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, చట్ట అమలు సంస్థల ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ దేశంలోని అతిపెద్ద బాలల సంరక్షణ నెట్‌వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ లో భాగస్వామి సంస్థగా పనిచేస్తోంది. ఈ నెట్‌వర్క్‌లో 250కు పైగా భాగస్వామ్య సంస్థలు కలిసి దేశవ్యాప్తంగా బాలల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నాయి. రక్షించబడిన పిల్లల వయస్సు ఎనిమిది నుండి పదిహేడు సంవత్సరాల మధ్య ఉంది. వీరు అనేక నెలలుగా వివిధ వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరిలో చాలామంది అధిక పని గంటలు, తక్కువ వేతనాలు మరియు వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి హానికరమైన ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయవలసి వచ్చినట్లు వెల్లడైంది. రక్షణ చర్యల అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి. అలాగే రక్షించబడిన పిల్లలకు పునరావాసం కల్పించడం, చట్టం ప్రకారం అందుబాటులో ఉన్న పరిహారం మరియు ఇతర హక్కులు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. జూన్ నెలను బాల కార్మికత్వ వ్యతిరేక 'యాక్షన్ మంత్'గా పాటిస్తున్నారు. బాలల అక్రమ రవాణా చైల్డ్ ట్రాఫికింగ్ బాల కార్మికత్వానికి ప్రధాన కారణాల్లో ఒకటి కావడంతో, పరిపాలన, పోలీసులు మరియు గ్రామీణ స్థాయి సంస్థలు అక్రమ రవాణాదారులను మరియు వారి నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు కఠిన నిఘా నిర్వహిస్తున్నాయి. ఈ కాలంలో జిల్లా పరిపాలన, పోలీసులు మరియు పౌర సమాజ సంస్థలు సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టి, బాల కార్మికత్వంలో నిమగ్నమైన అక్రమ రవాణా బాధిత పిల్లలను గుర్తించే పనిని కూడా కొనసాగిస్తాయి. ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్ మాట్లాడుతూబాల కార్మికత్వం నుండి రక్షించబడే ప్రతి చిన్నారి విద్య, భద్రత మరియు గౌరవంతో జీవించే తన హక్కును తిరిగి పొందినట్టే. బాల కార్మికత్వం పిల్లల బాల్యాన్ని, వారి ప్రాథమిక హక్కులను హరిస్తుంది. దీనిని అత్యంత అత్యవసరంగా ఎదుర్కోవాలి. ఏ పిల్లవాడి స్థానం పనిస్థలంలో కాదు ప్రతి పిల్లవాడి స్థానం పాఠశాలలోనే. బాల కార్మికత్వం మరియు బాలల అక్రమ రవాణా పరస్పర సంబంధం కలిగి ఉన్నందున, పిల్లలను రక్షించడం, అక్రమ రవాణాను అడ్డుకోవడం మరియు రక్షించబడిన ప్రతి చిన్నారికి అవసరమైన సంరక్షణ, పునరావాసం మరియు అవకాశాలు అందేలా మేము పరిపాలన మరియు చట్ట అమలు సంస్థలతో కలిసి నిరంతరం పనిచేస్తాము అని తెలిపారు. ఈ నెట్‌వర్క్ యొక్క ప్రధాన బలం పరస్పర అప్రమత్తత మరియు సహకారంలో ఉంది. దేశవ్యాప్తంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్య సంస్థలు బాలల అక్రమ రవాణా కేసులపై సమాచారాన్ని పంచుకుంటూ, ఒకరికొకరు కీలక సహాయ వ్యవస్థగా పనిచేస్తున్నాయి. ఈ నెట్‌వర్క్ యొక్క సమాచార మార్పిడి వ్యవస్థల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పిల్లలను గుర్తించడం, అన్వేషించడం మరియు రక్షించడం సాధ్యమైంది. ఏప్రిల్ 2023 నుండి మార్చి 2026 వరకు ఈ నెట్‌వర్క్ 1,45,000 కంటే ఎక్కువ మంది పిల్లలను అక్రమ రవాణా నుండి రక్షించింది. వీరిలో చాలా మంది బాల కార్మికత్వంలోకి బలవంతంగా నెట్టబడిన చిన్నారులే.

# వర్షం రావడంతో రైతన్నలకు ఎంతో మేలు

**హోళగుంద (భారత శక్తి):** రాష్ట్ర సరిహద్దు మార్లమడికి వద్ద ప్రవహిస్తున్న వేదవతి నదికి జలకళను సంతరించుకుంది. ప్రధానంగా శుక్రవారం రాత్రి నది ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి భారీ వర్షపు నీరు నదికి చేరాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరియు రాత్రి హోళగుందలో 14.4ఎంఎంల వర్షపాతం నమోదైనట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఈ వర్షం రైతన్నలకు ఎంతో మేలు చేకూర్చిందని రైతన్నలు పొలం సాగు లో బిజీ బిజీ రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

**తుగ్గలి:(భారత శక్తి)** తుగ్గలి మండల పరిధిలోని గల గుత్తి ఎర్రగుడి గ్రామానికి చెందిన వైయస్సార్సీపి పార్టీ మాజీ ఎంపీటీసీ వడ్ల రామాంజనేయులు మృతదేహానికి పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. శనివారం రోజున ఉదయం మండల పరిధిలోని గల వైసీపీ నాయకులతో కలసి గుత్తి ఎర్రగుడి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపి భరోసాను కల్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు మృతి పార్టీకి తీరని లోటు అని ఆమె తెలియజేశారు. పార్టీలో ఉన్నన్ని రోజులు అంకితభావంతో పనిచేసి పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేశారని ఆమె తెలియజేశారు. మాజీ ఎంపిటిసి రామాంజనేయులు మృతి పట్ల ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆమె భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్య దర్శి శ్రీనివాస రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రాతన మోహన్ రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, టిఎండి హుస్సేన్, చాంద్ బాషా, సత్య, గుంత రఘు, నారాయణ నాయక్, తదితర మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

# నయా స్ట్రాటజీతో జనసేనాని

**విజయవాడ,(భారత శక్తి)** జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఆలోచన అంతా కొత్త ఓటు బ్యాంకుపైనే ఉంది. యువ ఓటర్లపైనే ఆయన ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కొత్తతరం ఓటర్లు లక్షల సంఖ్యలో వస్తారు. వారే ఎన్నికల్లో విజయానికి కీలకంగా మారనున్నారు. గెలుపులో యువత కీలక భూమిక పోషిస్తుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తనకు కులాలు అంటగట్టవద్దని పదే పదే కోరుతున్నారు. తనను ఒక కులానికే ముద్ర వేసి చూడవద్దని, అందరూ ఓట్లు వేస్తేనే తాను గెలిచానని పవన్ కల్యాణ్ పదే పదే గుర్తు చేస్తున్నారు. దీని వెనక పవన్ ఆలోచన రాబోయే యువతరం ఓట్లను ఆకట్టుకునేందుకేనన్నది ఆయన నయా స్ట్రాటజీగా తెలుస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబును పక్కన పెడితే .. టీడీపీలో లోకేశ్, వైసీపీలో జగన్, జనసేనలో పవన్ అందరూ చిన్న వయసు వాళ్లే. అందరికంటే లోకేశ్ వయసులో చిన్న అయినప్పటికీ రాజకీయాల్లోకి వచ్చేసరికి మిగిలిన ఇద్దరూ కూడా యూత్ లీడర్ల కిందే లెక్క. అయితే ఈ ముగ్గురిలో యూత్ తనకు కనెక్ట్ అవ్వాలన్నది జనసేనాని ఆలోచనగా ఉంది. పవన్ కల్యాణ్ పై అవినీతి ముద్ర లేదు. మాట మీద నిలబడి ఉండరన్న పేరు తప్ప.. పవన్ కల్యాణ్ పై రెటువంటి చెడు అభిప్రాయం లేదు. మరొకవైపు పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తారని, రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులపై ఫోకస్ పెడతారన్న పేరు తెచ్చుకోవాలన్న తాపత్రయంలో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఇప్పటికే ఓటర్ల సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. చాలా వరకూ ఓట్లు పోతాయి. 2029 ఎన్నికల్లో కొత్త ఓటర్లు వచ్చి చేరతారు. వారిని టార్గెట్ చేసుకుని తాను ముందుకు వెళితే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు.

# గంజాయి నియంత్రణ శాంతిభద్రత పై ప్రజలతో అవగాహన కార్యక్రమం

## - ఎస్ఐ. మల్లేశ్వరరావు

**అరకులోయ (భారత శక్తి)** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అరకులోయ మండలం లోతేరు పంచాయితీ లోతేరు మారుమూల గ్రామంలో అరకు ఎస్ఐ మల్లేశ్వరరావు పోలీస్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు అనంతరం గ్రామ ప్రజలతో ఎస్ఐ మాట్లాడుతూమహిళల భద్రత పై మహిళలకు అవగాహన కల్పిస్తూ, గంజాయి నేరాలు నివారణ, రోడ్డు ప్రమాదాలు నివారణ, నాటు సారా పై అవగాహన కనిపిస్తూ ప్రతి ఒక్క యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ముఖ్యంగా గంజాయి సాగు చేయడం రవాణా చేయడం చేసినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు గంజాయి నాటసార కు దూరంగా ఉండాలని రోడ్డు ప్రమాదల నివారణ పై యువత కు అవగాహన కల్పిస్తూ ఎవరైనా రోడ్లపై వాహనాలతో వేగంగా వాహనాలు నడపడం హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఉన్నట్లయితే వాళ్లపై చట్టపరమైన చర్యలు ఉంటాయని అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలు యువతి యువకులు మహిళలు పాల్గొన్నారు



# తల సేమియాను తరిమికొడదాం.!



**రాయచోటి(భారత శక్తి)** చిన్నారులను తీవ్రంగా వేధిస్తున్న తల సేమియా వ్యాధిని తరిమికొడదామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు శనివారం రాయచోటి నియోజకవర్గం లో గాలివీడు లో తల సేమియా వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నారులను తలసే మియా వ్యాధి తీవ్రంగా వేధిస్తోందని ఈ వ్యాధి నివారణకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని యువకులకు సూచించారు. ఈ తల సేమియా వ్యాధితో ఏ చిన్నారి ప్రాణాలు పోకూడదని చిన్నారుల ప్రాణాలు కాపాడడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు.తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరానికి శ్రీకారం చుట్టిన మంత్రి మండిపల్లి× గాలివీడు మండలం, గాలివీడు టౌన్‌లోని బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో "సేవాభావం స్వచ్ఛంధ సేవా సంస్థ" ఆధ్వర్యంలో తలసేమియా బాధిత పిల్లల కోసం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా,శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఘనంగా ప్రారంభించారు.ఒక్క రక్తదానం ఎన్నో ప్రాణాలకు జీవదానం" అనే సందేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో యువత×, సేవా కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలుద్దాం.సేవే పరమో ధర్మః అనే లక్ష్యంతో ముందుకు సాగుదాం.యువత సేవా స్ఫూర్తికి మంత్రి మండిపల్లి అభినందనలుగాలివీడు మండలం, గాలివీడు టౌన్‌లోని బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో "సేవాభావం స్వచ్ఛంధ సేవా సంస్థ" ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం× నిర్వహించిన బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలోఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వయంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణాలను నిలబెట్టే మహాదానమని, ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు ప్రతి రక్తపు బొట్టు ఎంతో విలువైనదని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.గత రెండు సంవత్సరాల వ్యవధిలోనే 5సార్లు రక్తదానం చేసిన రాంప్రసాద్ రెడ్డి .సేవా భావానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రజల కోసం పని చేయడమే కాకుండా అవసరమైన సమయంలో ప్రాణదాతగా మారడం ఆయన గొప్ప మనసుకు అద్దం పడుతోందని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభినందించారు."ఒక్క రక్తదానం ఎన్నో ప్రాణాలకు జీవదానం"సేవే పరమో ధర్మః అనే భావనతో ముందుకు సాగుదాంరక్తదానం చేయండి? ప్రాణాలను కాపాడండిగాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామం నాగన్న గుట్టపాలెంలో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ నాయుడు కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఽ క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ×ప్రభాకర్ నాయుడు పార్టీకి నిబద్ధతతో పనిచేసిన నాయకుడని, గ్రామ ప్రజల మధ్య మంచి గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. సేవా భావంతో ప్రజల్లో నిలిచిన నాయకుడు.పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తప్రభాకర్ నాయుడు సేవలు చిరస్మరణీయం?ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి ప్రార్థించారు.గాలివీడు మండలం, ఎగువగొట్టివీడు గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని సి. నాగమళ్ళు గత రెండు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఇంటి వద్ద ఉండగా, విషయం తెలుసుకున్న ×ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఽ క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ×నాగమళ్ళు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు..అలాగే చికిత్సకు అయ్యే ఖర్చులను మరియు ద్వారాఅందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని మంత్రి పేర్కొన్నారు.

## కోరుకొండ అంకాలమ్మ ఆలయంలో అన్నసంతర్పణ



**కోరుకొండ (భారత శక్తి)**గ్రామంలోని శ్రీ అంకాలమ్మ తల్లి ఆలయంలో శనివారం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించి తరించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, దాతలు విజయవంతం చేశారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమానికి బిజెపి నాయకుడు కంబాల శ్రీనివాస్ లక్ష రూపాయలు విరాళం ఇచ్చారని ఆలయ కమిటీ తెలియజేశారు

## వైసిపి హయాంలో 286దేవాలయాలపై దాడులు

**- హిందూ గర్జన సభలో వక్తలు**

**తిరుపతి(భారత శక్తి)**గత వైసిపి ప్రభుత్వంలో హిందూ దేవాలయాల్లో విధ్వంసం సృష్టించారు. కల్తీనెయ్యితో తిరుమలను అపవిత్రం చేశారని ఎపి సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. శనివారం తిరుపతిలో జరిగిన హిందూ గర్జన సభలో అయన ప్రసంగించారు.శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ హిందువుల మనోభావాలతో ఆటలాడుకున్నారు. భూమన కరుణాకర్ తప్పు మీద తప్పులు చేస్తున్నాడు. భూమనను తిరుపతి నుంచి తరిమికొట్టాలి. కూటమి ప్రభుత్వం దేవాలయ వ్యవస్థను గాఢిలో పెడుతోంని అన్నారు.ఎపి సాధుపరిషత్ గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణ, మాట్లాడుతూ వైసిపి హయాంలో 286దేవాలయాలపై దాడులు జరిగాయి. హిందూ వ్యతిరేకి వైఎస్ జగన్. భూమన చెప్పే నీతి వ్యాఖ్యలను ఎవరూ నమ్మరు. భూమన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని అన్నారు.శివకామేశ్వరి పీఠం పీఠాధిపతి శివానందస్వామి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు హిందువుల మనోభావాలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందాం.

హిందువుల్లో చైతన్యం తీసుకువస్తాం. భూమనకు రాక్షస బుద్ధులు ఎక్కువగా ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో భూమన కుటుంబం నుంచి ఎవరు పోటీ చేసినా ఘోరంగా ఓడిస్తాం. బి.ఆర్.నాయుడు హయాంలో తిరుమలలో ఎన్నో మార్పులు చూస్తున్నాం. లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదాల నాణ్యత పెరిగిందని అన్నారు.తిరుక్షేత్రాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ హిందువుల ఐక్యత చాటుతాం. భూమన కరుణాకర్ రెడ్డిని తిరుపతి నుంచి తరిమేస్తాం. భూమన అన్యమతస్తుడు. టిటిడి ఛైర్మన్ గా భూమన ఉన్నప్పుడు తిరుమలలో అన్యమతప్రచారం జరిగిందని ఆరోపించారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**మచిలీపట్నం (భారత శక్తి)**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కార్మికుల హాజరు అమలు విధానం పై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యతతో పాటు నిర్దేశిత లక్ష్యాల మేరకు కొనసాగాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## బంగారు మరియు వెండి వస్తువుల సమర్పణ

**- శ్రీశైలం.శ్రీశైల దేవస్థానం, తేది: 13.06.2026**



**కాకినాడ (భారత శక్తి)** పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్, మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు శ్రీ స్వామిఅమ్మవార్లకు పలు వెండి వస్తువులను, బంగారు అభరణాలను సమర్పించారు. బంగారు నామాలు మరియు చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు మరియు బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను వీరు సమర్పించడం జరిగింది. కాగా సమర్పించబడిన మొత్తం వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు కాగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములు. వీటి విలువ సుమారు కోటి రూపాయల దాకా ఉంటుందని దాతలు తెలియజేశారు. ఈ బంగారు అభరణాలు మరియు వెండివస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మట్టే శ్రీనివాస్ కుటుంబసభ్యులైన రోహన్, రాకేష్ సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ డైరెక్టర్ మరియు ఆదిత్యకృష్ణ తదితరులు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావుగారికి అందజేయడం జరిగింది. కార్యక్రమములో స్వామివార్ల ప్రధానార్చకులు వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు విజయకుమార్ స్వామి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజిరవి, ధర్మప్రచార పర్యవేక్షకులు నాగేశ్వరరావు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ముఖ్యభద్రతా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

## శనివారం నుండి ఈనెల 15 వరకు ట్రాఫిక్ ఆంక్షలు!



**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్ సిటీ హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాపై కొత్త వంతెన ఏర్పాటు సందర్భంగా సోమవారం నుండి ఈనెల 15 వరకు ఆయా ప్రాంతాల్లో సాధారణ వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని నగర జాయింట్ కమిషనర్ ట్రాఫిక్ జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. హిమాయత్‌నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి ఇందిరాపార్కు వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తామన్నారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు.

## ఈషా సింగ్‌కు సత్కారం

**హైదరాబాద్ (భారత శక్తి)**మ్యూనిచ్లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ 2026లో మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో స్వర్ణపతకం గెలుపొంది ప్రపంచ రికార్డు సృష్టించిన ప్రపంచ ఛాంపియన్, షూటర్, అర్జున అవార్డీ ఈషా సింగ్ 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం బంజారాహిల్స్ లోని లీలా హోటల్లో జరిగింది. లైఫ్ స్పాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జయేశ్ రంజన్, గౌరవ అతిథులుగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్పర్సన్, ఎండీ, ఐఎఫ్ఎస్ అధికారిణి సోనీ బాలదేవి, నగరంలోని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, లైఫ్ స్పాన్ సంస్థ వ్యవస్థాపకుడు డా. నరేంద్ర రామ్ నంబుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈషా సింగ్ ను సత్కరించారు

## కలెక్టరేట్‌ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి

**- యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి**

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ (భారత శక్తి)**పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవనం పరిశీలన.కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు,కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి,మౌలిక సదుపాయాల పనులు పూర్తి అవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

**- వేతనాలు పెంచాలని డిమాండ్**

**(భారత శక్తి)**అమీన్‌పూర్ మండలం తాపీ మేస్త్రీల యూనియన్ అధ్యక్షుడు కుంచాల నాగేంద్రబాబు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించి శివాలయం చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కుంచాల నాగేంద్రబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మేస్త్రీలు, కార్మికులకు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల జీవనం భారంగా మారిందన్నారు. తినే తిండి నుంచి కాలే కట్టె వరకు అన్ని ఖర్చులు పెరిగినా భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.భవన నిర్మాణ రంగం ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తున్నప్పటికీ, ఈ రంగంలో పనిచేసే కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం తగిన దృష్టి సారించడం లేదన్నారు. కార్మికులకు హెల్త్ కార్డులు, బీమా పథకాలు, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని కోరారు.అమీన్‌పూర్ మండలానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు భారీ ఎత్తున హాజరై నిరసనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యం, సంగమేష్, మధు, గోపి, అంజి, మురళి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలి

**- వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కొర్ర సీతారాం**



**అరకులోయ(భారత శక్తి)** అరకులోయ పట్టణం లో వినియోగదారుల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ హోటల్లలో టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలు నాణ్యత పాటించాలని సూచించారు ఆహార పదార్థాలు తయారీ నిలువ నమ్మకం నాణ్యత పాటించాలని ఫుడ్ సేఫ్టీ ప్రతి ఒక్క హోటల్ యాజమాన్యం లైసెన్స్ కలిగి ఉండాలని జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కొర్రా సీతారం హెచ్చరించారు హోటల్లలో టిఫిన్ సెంటర్ లలో నాణ్యమైన భోజనం అందించాలని హోటల్ యజమానియాలకు కోరారు ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కమిటీ అధ్యక్షులు చెడ్డ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు లీగల్ సెల్ సమావేశం 15 తారీకు సోమవారం టీటీడీ కల్యాణ మండపం లో సమావేశం ఉంటుందన్నారు అందరూ ఆహ్వానితులే అని తెలిపారు

## గోకవరంలో ఎమ్మార్పీకి 10 అదనం...

**- ఎక్సైజ్ అధికారులు మౌనం- కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం అదనపు రేట్లు**

**- పట్టించుకోని కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు - నోరు ఎత్తని ప్రతిపక్షాలు**



**గోకవరం (భారత శక్తి)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోకవరం మండలంలో ఎమ్మార్పీ ధరలకు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పత్రికల్లో కథనాలు వచ్చినా, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందినా అధికారులు దాడులు చేయకపోవడం, చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మండలంలోని అన్ని షాపుల్లో ఇదే పరిస్థితి నెలకొందని, పేదలు, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అక్రమ వసూళ్లను అడ్డుకోవడంలో విఫలమైందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తున్న వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.ఈ అంశంపై ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

## విధి నిర్వహణలో లైన్మెన్‌కు విద్యుత్ షాక్

**తిరుపతి (భారత శక్తి)**వెంకటగిరి విద్యుత్ శాఖ పరిధిలో... విధి నిర్వహణలో ఉన్న జూనియర్ లైన్ మెన్ పోతన (23)కు విద్యుత్ షాక్ నిర్వహణలో ఉన్న ఓ లైన్మెన్‌కు విద్యుత్ షాక్ తగలడంతో విద్యుత్ స్తంభం (పోల్) పై నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడిన ఘటన వెంకటగిరి సబ్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాయపడిన ఉద్యోగిని వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారుఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అయితే, సంబంధిత అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేయకుండా పనులు చేపట్టడం వంటి కారణాల వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని తల్లిదండ్రులు, స్థానికులు, ఆరోపిస్తున్నారు. లైన్మెన్ ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులకు సంబంధిత ఉన్నతాధికారి సరైన సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగినప్పటికీ స్పందించకుండా తప్పించుకోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి, భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు సమాచారం అందించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు మౌనం వహించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, ప్రమాదానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చుక్కలు చూపించిన బైకర్

**- ఆర్టీసీ డ్రైవర్ తగ్గని పరిస్థితి**

**హైదరాబాద్(భారత శక్తి)** హైదరాబాద్ నగరంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యానికి, ఓ సామాన్య బైకర్ సాహసానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాంగ్ రూట్‌లో బస్సును నడిపిన డ్రైవర్‌కు ఆ బైకర్ అడ్డుగా నిలిచి, చివరికి బస్సును వెనక్కి తిప్పేలా చేసి హీరోగా నిలిచాడు.వివరాల్లోకి వెళితే.. నగరంలోని రద్దీ ప్రాంతంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ ట్రాఫిక్‌కు ఎదురుగా, రాంగ్ రూట్‌లో వేగంగా బస్సును నడుపుకుంటూ వచ్చాడు. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ యువకుడు ఇది గమనించి ఏమాత్రం భయపడలేదు.

తన బైక్‌ను ఆ బస్సుకు సరిగ్గా ఎదురుగా ఆపేశాడు. బస్సు వేగానికి ఇతరులు పక్కకు తప్పుకున్నా, అతను మాత్రం వెనకడుగు వేయలేదు.దీంతో ఆగ్రహానికి గురైన డ్రైవర్ బస్సును కుడివైపునకు తిప్పి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. కానీ, ఆ బైకర్ కూడా పట్టువదలకుండా బస్సు వెళ్లే మార్గానికి మళ్లీ తన బైక్‌ను అడ్డంగా పెట్టాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బైకర్ చర్యను చూసి రోడ్డుపై ఉన్న ఇతర వాహనదారులు కూడా అతనికి మద్దతుగా నిలిచారు.చుట్టూ జనం చేరడం, బైకర్ ఏమాత్రం తగ్గకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్‌కు పరిస్థితి అర్థమైంది. చేసేదేమీ లేక, బస్సును నెమ్మదిగా వెనక్కి తిప్పక తప్పలేదు. ఈ నడిరోడ్డు హైడ్రామాను అక్కడున్న వారు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు బైకర్ ధైర్యాన్ని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ‘దృఢమ్’ మూవీ రివ్యూ!

మలయాళంలో ‘షేన్ నిగమ్’ కి మంచి క్రేజ్ ఉంది. ఆయన పోలీస్ ఆఫీసర్ గా నటించిన క్రైమ్ థ్రిల్లర్ ‘దృఢమ్’. జీతూ జోసెఫ్ శిష్యుడు ‘మార్టిన్ జోసెఫ్’ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. జీతూ జోసెఫ్ సమర్పకుడిగా వ్యవహరించాడు. అందువలన ఈ సినిమాపై ఆయన మార్క్ కనిపిస్తుంది. మే 8వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ నెల 12వ తేదీ నుంచి ‘జియో హాట్ స్టార్’లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో కలుపుకుని ఐదు భాషల్లో అందుబాటులో ఉంది.
విజయ్ (షేన్ నిగమ్) ‘పాలక్కడ్’ కి చెందిన యువకుడు. తల్లిదండ్రుల కోరిక మేరకు అతను పోలీస్ ఆఫీసర్ అవుతాడు. ఫస్టు పోస్టింగ్ పై, అడవిని అనుకుని ఉన్న ఓ విలేజ్ కి వెళతాడు. అక్కడి పోలీస్ స్టేషన్ స్టాఫ్ గా, కృష్ణన్ ..బాలన్ .. సత్యన్ .. ఆనంద్ .. విద్య .. రమ్య ఉంటారు. కృష్ణన్ మాత్రం పదవీ విరమణకు దగ్గరలో ఉంటాడు. అందరూ కూడా విజయ్ ను ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంటారు. క్వార్టర్స్ లో సరదాగా గడుపుతూ ఉంటారు.

అలాంటి సమయంలోనే ఆ విలేజ్ కి సంబంధించిన ఆయా ప్రదేశాలలో ఒక్కొక్కటిగా శవాలు బయటపడుతూ ఉంటాయి. గుర్తుపట్టలేనంత దారుణమైన స్థితిలో ఆ శవాలు ఉంటాయి. అందరూ కూడా తల వెనుక భాగంలో బలమైన గాయం ఏర్పడిన కారణంగా చనిపోయారనే విషయం పోస్టు మార్టం నివేదికలో వెల్లడవుతుంది. అదే సమయంలో ఒక ఫైనాన్స్ కంపెనీ నుంచి 120 సవర్ల బంగారం .. 50 లక్షల నగదు మాయమవుతుంది. ఆ ఫైనాన్స్ కంపెనీని ‘షాజీ’ నిర్వహిస్తుంటాడు. ఒక వైపున దొంగలను .. మరో వైపున హంతకులను పట్టుకోవడానికి విజయ్ టీమ్ రంగంలోకి దిగుతుంది. హంతకుడు ఒకరేనా? ఫైనాన్స్ కంపెనీలో జరిగిన దొంగతనానికీ .. ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో విజయ్ దర్యాప్తు కొనసాగుతూ ఉంటుంది. ఈ ఇన్వెస్టిగేషన్ లో ఆయనకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? వాటిని ఆయన ఎలా ఎదుర్కొంటాడు? అనేది మిగతా కథ. క్రైమ్ థ్రిల్లర్ .. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమాలను ఇంట్రెస్టింగ్ గా నడిపించడంలో మలయాళ దర్శకులకు మంచి నైపుణ్యం ఉంది. అందువలన ఈ జోనర్ కి సంబంధించిన సినిమాల పట్ల ఓటీటీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిని కనబరుస్తుంటారు. అదే జోనర్ లో రూపొందిన ‘దృఢమ్’ సినిమా కోసం కూడా అలాగే ఎదురుచూశారు. ఇది జీతూ జోసెఫ్ సమర్పించిన సినిమా కావడం, అంచనాలు పెరగడానికి మరో కారణమైంది. ఈ కథ ఫారెస్టును అనుకుని ఉన్న ఒక విలేజ్ చుట్టూ .. ఆ విలేజ్ లోని పోలీస్ స్టేషన్ చుట్టూ .. అక్కడ కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్న పోలీసుల చుట్టూ తిరుగుతుంది. ఒక వైపున హత్యలు .. మరో వైపున ఫైనాన్స్ కంపెనీలో జరిగిన చోరీ .. ఈ రెండు సంఘటనల మధ్యలో సాగే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథగా మనం ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు. మార్టిన్ చాలా వివరంగా ఈ కథను రాసుకున్నాడు. తన గురువైన జీతూ జోసెఫ్ మార్క్ కి దగ్గరగా ఈ కథను తీసుకుని వెళ్లడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. పోలీసులు .. నేరస్థులు .. ఇంటరాగేషన్ .. ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలను సహజత్వానికి దగ్గరగా తీసుకుని వెళ్లడానికి గట్టిగానే ట్రై చేశాడు. అయితే ఆ ప్రయత్నంలో ఆయన కొంతవరకు మాత్రమే సక్సెస్ అయ్యాడని చెప్పుకోవలసి ఉంటుంది.

సాధారణంగా చాలా కథలు ఇంటర్వెల్ బ్యాంగ్ నుంచి కొత్త మలుపు తీసుకుంటూ ఉంటాయి. అక్కడి నుంచి కథ నెక్స్ట్ లెవెల్ కి వెళుతూ ఉంటుంది. కానీ ఈ సినిమాలో అలాంటి ఒక మలుపు ప్రీ క్లైమాక్స్ లో వస్తుంది. అప్పటి వరకూ ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు .. అనుమానిత పాత్రలు తెరపైకి వచ్చి వెళుతూ ఉంటాయి. అయితే ఈ తతంగం మొత్తం నడిచిన తీరు చాలా నిదానంగా అనిపిస్తుంది. సినిమా మొత్తం కూడా చివరి 30 నిమిషాలపై ఆధారపడి నడుస్తుంది. ఈ అరగంట నిడివిలో నడిచే ఎపిసోడ్ కోసమే మిగతా గంటన్నర కథను సాగదీశారని చెప్పొచ్చు. అయితే పోలీసు పాత్రలను పోషించిన ప్రతి ఆర్టిస్ట్ ప్రదర్శించిన నటన రియలిస్టిక్ గా అనిపిస్తూ, మనలను కథ వెంట కదిలేలా చేస్తుంది. మిగతా గంటన్నర కథపై కూడా మరింత కసరత్తు చేసుంటే, ఇది జీతూ జోసెఫ్ సినిమా అంటే నమ్మేసేలా ఉండేది. హత్యలు .. దొంగతనాలు .. అనుమానితులు .. ఇన్వెస్టిగేషన్లు అంటూ గతంలో చాలా సినిమాలు వచ్చి ఉంటాయి. అయితే ఆ సినిమాలలో ఎవరూ చూడని ఒక క్లైమాక్స్ ను .. ఎంతమాత్రం ఊహించని క్లైమాక్స్ ను ఈ సినిమాలో చూడొచ్చు. అరగంటసేపు మనలను కదలనీయకుండా చూసే ఈ క్లైమాక్స్ కోసమే ఈ సినిమాను చూడొచ్చునేమో అనిపించేలా ఉంటుంది. కథాకథనాలు కాస్త నిదానంగానే నడుస్తాయి. అయినా ఆడియన్స్ కి బోర్ కొట్టకుండా చేసినవి ఏమైనా ఉన్నాయంటే అవి లొకేషన్స్ అనే చెప్పాలి. అద్భుతమైన లొకేషన్స్ ఆడియన్స్ ఆకలి తీరుస్తాయి. ఇక నేపథ్య సంగీతం కూడా సందర్భానికి తగినట్టుగా వెళుతుంది. ఎడిటింగ్ వర్క్ కూడా చాలా నీట్ గా అనిపిస్తుంది. ఇంతవరకూ వచ్చిన పోలీస్ కథలకు ఈ కథ చాలా భిన్నంగా అనిపిస్తుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.



కాకపోతే చివరి అరగంట కోసం, దానికి ముందున్న కథను సాగదీయడమే కాస్త ఇబ్బందిని కలిగిస్తుంది. ‘పరిస్థితులే కొంతమందిని హీరోలను చేస్తాయి .. మరికొంతమందిని విలన్స్ గా మారుస్తాయి’ అనే ఒక డైలాగ్ ఈ సినిమాలో ఉంది. ఆ పరిస్థితులు ఏమిటనేది తెలుసుకోవడానికి ఒక గంటన్నరసేపు ఓపిక పడితే, మిగతా అరగంట కథ ఆ అసంతృప్తిని దూరం చేస్తుందనే చెప్పాలి.

## మళ్లీ అలాంటి పాత్రలు ఎప్పుడు వస్తాయో..

### - ఎదురుచూస్తున్నానన్న జాతీయ అవార్డు నటి



‘మహానటి’ చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న కీర్తి సురేశ్, తాజాగా తన కెరీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ చిత్రంలో తాను పోషించిన సావిత్రి పాత్ర తరహాలోనే, మళ్లీ అంతటి బలమైన మరియు గుర్తింపు తెచ్చే పాత్ర కోసం ఎదురుచూస్తున్నానని ఆమె వెల్లడించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి, తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. “మహానటి నా జీవితాన్నే మార్చేసింది. అంతటి గొప్ప నటి పాత్రను పోషించడానికి మొదట్లో భయపడినప్పటికీ, అది ఒక అరుదైన అవకాశం అని నాకు తెలుసు. ఆ చిత్రం నాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. అయితే, గత కొంతకాలంగా ఆ స్థాయి విజయం దక్కలేదు. ప్రస్తుతం మళ్లీ అలాంటి పవర్‌ఫుల్ పాత్రల కోసమే ఎదురుచూస్తున్నాను” అని కీర్తి సురేశ్ వివరించారు. మహానటి విడుదలైన తర్వాత దాదాపు ఆరు నెలల పాటు తనకు ఒక్క సినిమా ఆఫర్ కూడా రాలేదని ఆమె గతంలోనే పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం కీర్తి సురేశ్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన తాజా తమిళ చిత్రం ‘రివాల్వర్ రీటా’ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. అలాగే, బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు సరసన ‘రఫ్తార్’ అనే చిత్రంలో నటిస్తున్నారు; ఇది జూలైలో విడుదల కావాల్సి ఉంది. తెలుగులో విజయ్ దేవరకొండతో ‘రౌడీ జనార్ధన’, ‘రెండు జెళ్ల సీత’ చిత్రాలతో పాటు, తమిళంలో ‘కన్నివేది’, మలయాళంలో ‘తోట్టం’ వంటి విభిన్న ప్రాజెక్టులతో ఆమె బిజీగా గడుపుతున్నారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూనే, మరో ‘మహానటి’ వంటి ప్రాముఖ్యత ఉన్న పాత్ర కోసం ఆశిస్తున్నానని ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## రొమాంటిక్ హారర్ చిత్రంలో సయీ..



‘మేజర్’, ‘స్కంద’ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి సయీ మంజ్రేకర్, తాను నటిస్తున్న తాజా చిత్రం ‘ఇకాయ్’ తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్నదని తెలిపారు. రాఘవ్ జుయల్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ రొమాంటిక్ హారర్ సినిమా కోసం తాను ఎంతో శ్రమించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సయీ మంజ్రేకర్ మాట్లాడుతూ, “ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ‘ఇకాయ్’ నాకు అతిపెద్ద సవాలు విసిరింది. షూటింగ్ సమయంలో కొన్నిసార్లు నా కంఫర్ట్ జోన్ దాటి నటించాల్సి వచ్చింది. ొన్ని సన్నివేశాల్లో సహజమైన భావోద్వేగాలను పండించడం కష్టంగా అనిపించినప్పటికీ, ఇలాంటి అనుభవాలే ఒక నటిగా నన్ను మెరుగుపరుస్తాయని నమ్ముతున్నాను,” అని వివరించారు. ఈ చిత్రంలో తన నటనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులు చూస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్ సింగ్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే ముంబైలోని కొలాబా ప్రాంతంలో జరిగింది. యాక్షన్, డ్రామా తరహా పాత్రలకు భిన్నంగా ఓ రొమాంటిక్ హారర్ కథలో నటించడం తన కెరీర్‌కు ప్లస్ అవుతుందని సయీ భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ‘ఇకాయ్’ చిత్రాన్ని 2027 ప్రథమార్ధంలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## ఓటీటీలోకి ‘దృశ్యం 3’

### - జూన్ 18 నుంచి ప్రైమ్ వీడియోలో ‘దృశ్యం 3’



మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ‘దృశ్యం 3’ ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో సక్సెస్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ కానుంది. మే 21న విడుదలైన ఈ చిత్రం నెల రోజులు పూర్తికాకముందే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ‘దృశ్యం 3’ డిజిటల్ హక్కులను నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్ నుంచి ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాల్లో ఒకేసారి స్ట్రీమ్ చేయనున్నారు. దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథను కొత్త కోణంలో ఆవిష్కరించారు. గత రెండు భాగాల మాదిరిగా వరుస ట్విస్టులపై కాకుండా జార్జ్‌కుట్టి పాత్ర ఎదుర్కొనే నైతిక సంఘర్షణలు, కుటుంబాన్ని కాపాడేందుకు అతడు ఎంతదూరమైనా వెళ్లే పరిస్థితులను ప్రధానంగా చూపించారు. బాక్సాఫీస్ వద్ద కూడా ‘దృశ్యం 3’ భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.234.97 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం విదేశాల్లోనే రూ.111.50 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. భారత్‌లో రూ.123 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అత్యధిక కలెక్షన్స్ సాధించిన మలయాళ చిత్రాల్లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. మోహన్‌లాల్‌తో పాటు మీనా, ఎస్తేర్ అనిల్, అన్సిబా హసన్, సిద్ధిఖ్, ఆశా శరత్, మురళీ గోపీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ‘ధురంధర్’ కంటే ‘గదర్’ సినిమాకే ఎక్కువ మంది ప్రేక్షకులు వచ్చారు: అమీషా పటేల్

బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ‘ధురంధర్’, ‘ధురంధర్: ది రివెంజ్’ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ చిత్రాల కంటే తన 2001 నాటి బ్లాక్‌బస్టర్ ‘గదర్: ఏక్ ప్రేమ్ కథ’, మరియు 2023 లో వచ్చిన ‘గదర్ 2’ చిత్రాలకే ఎక్కువ మంది ప్రేక్షకులు (ఫుట్‌ఫాల్స్) థియేటర్లకు వచ్చారని బాలీవుడ్ నటి అమీషా పటేల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. 2026 జూన్ 15 నాటికి అమీషా పటేల్, సన్నీ డియోల్ ప్రధాన పాత్రల్లో నటించిన ‘గదర్: ఏక్ ప్రేమ్ కథ’ విడుదలై 25 ఏళ్లు పూర్తి కానుంది. ఈ సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే తాము 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకోబోతున్నాం. అయినప్పటికీ తమ చిత్రం ఇప్పటికీ ఒక ఐకానిక్ సినిమాగా నిలిచిందని అన్నారు.

‘గదర్ 2’ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల సునామీని సృష్టించిందని, కేవలం థియేటర్లలోకి వచ్చి సినిమా చూసిన ప్రేక్షకుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే, ‘గదర్ 1’, ‘గదర్ 2’ చిత్రాలు ‘ధురంధర్ చిత్రాల కంటే చాలా ఎక్కువ అని అమీషా పేర్కొన్నారు. ప్రేక్షకుల సంఖ్య పరంగా తమ సినిమాలు సాధించిన ఈ విజయం నన్ను ఎంతగానో సంతోషపరిచిందని, భారతీయ సినిమా చరిత్రలో తాను కూడా ఒక భాగమవడం, అంతటి గౌరవాన్ని అందుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. 1947 దేశ విభజన నేపథ్యంలో తెరకెక్కిన ‘గదర్: ఏక్ ప్రేమ్ కథ’ చిత్రం, ఒక సాధారణ సిక్కు ట్రక్ డ్రైవర్ తారా సింగ్ (సన్నీ డియోల్), విభజన సమయంలో ఒక ఉన్నత ముస్లిం కుటుంబానికి చెందిన సకినా (అమీషా పటేల్) ప్రాణాలను కాపాడటం చుట్టూ తిరుగుతుంది. ఆ తర్వాత





వారిద్దరూ పెళ్లి చేసుకుంటారు, అయితే కొన్ని పరిస్థితుల వల్ల వారు విడిపోవాల్సి వస్తుంది. తన భార్యను తిరిగి తీసుకురావడం కోసం తారా సింగ్ పాకిస్తాన్‌కు ఎలా వెళ్లాడనేదే మొదటి భాగం కథ. ఇక ‘గదర్ 2’ విషయానికి వస్తే, ఈ చిత్రంలో తారా సింగ్ తన కుమారుడు జీతేను రక్షించడం కోసం మరోసారి పాకిస్తాన్ లోకి అడుగుపెడతాడు.

# చిర్యాల భూవివాదం: హత్యాయత్నం కేసులో మరో 14 మంది అరెస్ట్

- రూ.లక్షల సుపారీతో దాడులు..
  ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులు రిమాండ్‌కు
- నిందితులపై రౌడీషీట్లు తెరుస్తాం



: మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్ హెచ్చరిక

కీసర, జూన్ 13 : భారత శక్తి, కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చిర్యాల గ్రామ సర్వే నంబర్ 156 భూవివాదంలో చోటుచేసుకున్న హత్యాయత్నం కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో శనివారం పోలీసులు మరో 14 మంది నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ప్రధాన నిందితులైన పల్లె భద్రరెడ్డి (ఏ1), బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి (ఏ2), పంజా సంజయ్ కుమార్ (ఏ3)లను ఈ నెల 7వ తేదీనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. తదుపరి దర్యాప్తులో భాగంగా ఈ రోజు ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మరో 14 మందిని కీసర పోలీసులు పట్టుకున్నారు.

## - ఇనుప రాడ్లు, కర్రలతో వాచ్‌మన్‌పై దాడి

పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం.. చిర్యాల గ్రామంలోని వివాదాస్పద భూమి వద్ద విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్ గోదుగు సాయికుమార్‌పై, అతడిని రక్షించేందుకు వచ్చిన మరికొందరు బాధితులు, సాక్షులపై నిందితులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన నిందితులతో చేతులు కలిపిన పందేటి రాజా, బుఖ్య రమేష్, గొల్లేరు నాగరాజు, మరుత రాజశేఖర్, బంధాల ప్రవీణ్, హత్వాల అజయ్ కుమార్, దొంతి నాగ సందీప్, కుంట శ్రీనివాస్, సయ్యద్ అజాం, జమీల్ ఖాన్, అబ్దుల్ నదీమ్ మరియు మహిళా నిందితులు ధర్మారపు ప్రియాంక, తన్నేరు శ్రావంతి, పిండి సుజాతలు ఇనుప రాడ్లు, హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

## - సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు

బాధితుల వాంగ్మూలాలు, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు, ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సీసీటీవీ ఫుటేజీలు వంటి సాంకేతిక ఆధారాల సాయంతో ప్రత్యేక పోలీసు బృందాలు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశాయి. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, దర్యాప్తు అధికారి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బందిని మల్కాజ్గిరి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సి. హెచ్. శ్రీధర్ అభినందించారు. కేసులో ప్రమేయమున్న మరికొందరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు.

## - సివిల్ వివాదాల్లో తలదూరిస్తే రౌడీషీట్లు: డీసీపీ

"భూమి యాజమాన్యంతో ఎలాంటి సంబంధం లేకుండా, కేవలం డబ్బుకు ఆశపడి సివిల్ వివాదాల్లో తలదూర్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి వారిపై రౌడీషీట్లు తెరుస్తాం. ఎలాంటి భూవివాదాలైనా కోర్టులు లేదా రెవెన్యూ చట్టాల పరిధిలోనే పరిష్కరించుకోవాలి. అసాంఘిక శక్తులు, రౌడీ మూకలను ఆశ్రయించి దాడులకు పాల్పడితే చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయి."

సి.హెచ్. శ్రీధర్, డీసీపీ, మల్కాజ్గిరి జోన్

# సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంట్‌లో నిరంతరం పోరాడుతా

- సింగరేణి పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచే వరకు నా పోరాటం కొనసాగుతుంది : ఎంపీ గడ్డం వంశీకృష్ణ



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 13 (భారత శక్తి): సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ గళం విప్పుతూనే ఉంటానని, సింగరేణి పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు పార్లమెంట్‌లో బలంగా పోరాడతానని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సింగరేణి మెడికల్ ఇన్‌వాలిడ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు డిపెండెంట్ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ, సింగరేణి కార్మిక నాయకులు సీతారామయ్య, జనక్ ప్రసాద్, శ్రీ వినోద్, చారి, సింగరేణి సీఎండీ, జనరల్ మేనేజర్లు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో దివంగత కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వంతో పోరాడి సంస్థను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల కోసం పెన్షన్ విధానాన్ని తీసుకురావడంలో కాకా వెంకటస్వామి గారి కృషి మరువలేనిదని, ఆ నిర్ణయం వల్ల వేలాది మంది కార్మిక కుటుంబాలకు న్యాయం జరిగిందని అన్నారు. సమయం దొరికిన ప్రతిసారీ సింగరేణి కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతున్నానని, భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు. సింగరేణి పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి సవాల్ విసురుతూ, "సింగరేణి కార్మికులపై నిజంగా ప్రేమ ఉంటే వారి పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకునే ధైర్యం ఉందా?" అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో కార్మికులు పోరాడినందువల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని, కార్మికుల త్యాగాలు, కృషిని ఎప్పటికీ మరవకూడదని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించి త్వరితగతిన సహాయం అందించాలని కోరారు. సింగరేణి కార్మికుల పక్షాన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు ఒక ప్రత్యేక వినతి చేస్తూ, మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించి మెడికల్ ఇన్‌వాలిడ్ కార్మికుల కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చివరిగా "జై సింగరేణి... జై జై సింగరేణి" అంటూ సింగరేణి కార్మికులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు.

# లక్కారం దళిత రైతులకు న్యాయం చేయాలి మెట్టు శ్రీధర్




పటాన్‌చెరు జూన్ 13 భారత శక్తి లక్కారం గ్రామ పరిధిలోని సర్వే నెం. 498లో గల 21 ఎకరాల 31 గుంటల అసైన్డ్ భూమిని సాగు చేసుకుంటున్న దళిత రైతులకు ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు న్యాయం చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ శనివారం బాధిత రైతులతో కలిసి భూములను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా పేద దళిత రైతులు ఈ భూమిని సాగు చేస్తూ తమ కుటుంబాల జీవనాధారంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమం కోసం అవసరమే అయినప్పటికీ, వాటి అమలులో పేద రైతుల జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్టీపీ (Sewage Treatment Plant) వంటి ప్రజాప్రయోజన ప్రాజెక్టుల ఏర్పాటును వ్యతిరేకించడం లేదని, అయితే భూములు కోల్పోతున్న రైతులకు చట్టబద్ధంగా న్యాయం జరగడం, తగిన పరిహారం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు బాధిత రైతుల పరిస్థితిని పునఃసమీక్షించి, వారితో చర్చించి న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని కోరారు. రైతుల హక్కులు మరియు జీవనాధార పరిరక్షణ కోసం తెలంగాణ యువజన సంఘాల సమితి మరియు నవభారత్ నిర్మాణ్ యువసేన ఎల్లప్పుడూ వారి పక్షాన నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ వీరేషం నాగరాజు స్థానిక నాయకులు, బాధిత రైతులు, గ్రామ పెద్దలు మరియు యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరిలో సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

## వారం రోజుల్లో మూడు భారీ మోసాల ఛేదనం, ముగ్గురు నిందితుల అరెస్ట్

మల్కాజ్‌గిరి, జూన్ 13 : భారతశక్తి, ఇటీవలి కాలంలో డిజిటల్ యుగంలో అమాయకులను ఆసరాగా చేసుకుని కోట్లాది రూపాయలు దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లపై మల్కాజ్‌గిరి కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జూన్ 7 నుండి జూన్ 13 వరకు జరిగిన ప్రత్యేక దర్యాప్తులో భాగంగా పోలీసులు మూడు ప్రధాన సైబర్ నేరాలను విజయవంతంగా ఛేదించి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను విచారించగా, ఈ సైబర్ నేరాల వెనుక దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠాలు ఉన్నట్లు మరియు స్థానిక యువతను మ్యూల్ అకౌంట్ (బ్యాంకు ఖాతాలు అద్దెకు ఇవ్వడం) దారులుగా వాడుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది. అలాగే, పోలీసులు తీసుకున్న ప్రత్యేక చొరవతో గౌరవనీయ న్యాయస్థానం ద్వారా బాధితులకు రూ. 50,000/- రీఫండ్ కూడా ఇప్పించారు.

### పోలీసులు వెల్లడించిన ఆ మూడు కేసుల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి:

1. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట లక్షల్లో వంచన (Job Fraud)

ఉద్యోగాల కోసం వెతుకుతున్న నిరుద్యోగులను టార్గెట్ చేస్తూ సాగుతున్న ఈ మోసంలో పోలీసులు హైదరాబాద్ రహ్మత్ నగర్‌కు చెందిన సజ్జల వాసు (తండ్రి: శంకర్) అనే మ్యూల్ అకౌంట్ హోల్డర్‌ను అరెస్ట్ చేశారు.

**నేరగాళ్ల వ్యూహం:** బాధితుడికి అపరిచిత నంబర్ల నుండి 'ఆదిత్య' అనే వ్యక్తి ఫోన్ చేసి, తాను ప్రముఖ 'రాండ్‌స్టాడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ప్రతినిధినని పరిచయం చేసుకున్నాడు. Naukri, Indeed, LinkedIn ల నుండి మీ రెజ్యూమ్ షార్ట్‌లిస్ట్ అయిందని, రూ. 4.5 లక్షల వార్షిక ప్యాకేజీతో 'అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్' ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికాడు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజు మరియు ఆఫర్ లెటర్ ఛార్జీల పేరిట విడతల వారీగా మొత్తం రూ. 1,80,000/- వసూలు చేసి అదృశ్యమయ్యాడు.

### 2. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరిట రూ. 38 లక్షల దోపిడీ (Investment Fraud)

మరో కేసులో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరిట నకిలీ అప్లికేషన్ ద్వారా మోసానికి పాల్పడిన కేసులో హైదరాబాద్ బషారత్ నగర్‌కు చెందిన మహమ్మద్ జుబేర్ (తండ్రి: లేట్ మహమ్మద్ అమీర్)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**నేరగాళ్ల వ్యూహం:** బాధితుడిని మొదట "ూాంజవత్ - =821 +తీశీష్ఠ ణఱంఎబంంఱశీఅ +తీశీబజూ" అనే వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి, తాము స్టాక్ మార్కెట్ నిపుణులమంటూ నమ్మించారు. అనంతరం »»ADVPMAµµ అనే నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి పెట్టుబడులు పెట్టించారు. బాధితుడికి నమ్మకం కలిగించడం కోసం మొదట రూ. 100/- విత్‌డ్రా చేసుకునే వీలు కల్పించారు. ఆ యాప్ స్క్రీన్‌పై ఏకంగా రూ. 1.65 కోట్లకు పైగా లాభం వచ్చినట్లు వర్చువల్ బ్యాలెన్స్ చూపించారు. అది నిజమైన లాభమేనని నమ్మిన బాధితుడు తన ICICI బ్యాంక్ ఖాతా నుండి ఏకంగా రూ. 38,01,872/- నేరగాళ్లు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసి మోసపోయాడు.

### 3. నకిలీ కస్టమర్ కేర్ - కోటి నలభై మూడు లక్షల మహా దోపిడీ!

ఈ వారంలో నమోదైన అత్యంత భారీ సైబర్ కేసులో, కస్టమర్ కేర్ పేరిట వాట్సాప్ ద్వారా సంప్రదించి రూ. 1.43 కోట్లకు పైగా దోచుకున్న ముఠాకు సహకరించిన హైదరాబాద్ జవహర్‌నగర్‌కు చెందిన దాడియ శివసాయి అలియాస్ బిట్టు (తండ్రి: దాడియ శ్యామ్)ను పోలీసులు అరెస్ట్ చేశారు.

**నేరగాళ్ల వ్యూహం:** బాధితుడిని వాట్సాప్‌లో 'సచిత రెడ్డి' అనే మహిళా ప్రొఫైల్ ద్వారా సంప్రదించి, తాము 'మార్కెట్ యాక్సెస్' (Market Axess) ప్రతినిధులమని, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో భారీ లాభాలు ఇప్పిస్తామని ఆశ చూపారు. మొదటిసారి చిన్న మొత్తంలో విత్‌డ్రా విజయవంతం కావడంతో బాధితుడు నమ్మి RTGS, IMPS, NEFT ల ద్వారా 17 లావాదేవీలలో ఏకంగా రూ. 1,44,20,000/- పెట్టుబడిగా పెట్టాడు. ఆ తర్వాత కేవలం రూ. ఒక లక్ష మాత్రమే విత్‌డ్రా చేసుకోనిచ్చి, మిగిలిన డబ్బు కావాలంటే 108,532 ఋణ ల (అమెరికన్ డాలర్ల) వడ్డీ లేని రుణాన్ని ముందే చెల్లించాలని షరతు పెట్టారు. దీంతో తాను పూర్తిగా మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, రూ. 1,43,20,000/- నికర నష్టం వాటిల్లినట్లు తేలింది.

### నెటిజన్లకు సైబర్ పోలీసుల అత్యవసర హెచ్చరికలు (Advisory):

ప్రస్తుతం సమాజంలో పార్ట్ టైమ్ జాబ్స్, ఉద్యోగాల పేరిట అడ్వాన్స్ ఫీజులు వసూలు చేయడం మరియు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ విపరీతంగా పెరుగుతున్నాయని మల్కాజ్‌గిరి సైబర్ క్రైమ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ హెచ్చరించారు. ప్రజలు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు మరియు యాప్‌లను నమ్మేటప్పుడు కింది జాగ్రత్తలు **ఖచ్చితంగా పాటించాలని సూచించారు:**

**అతి ఆశ వద్దు:** గ్యారెంటీ లాభాలు లేదా తక్కువ సమయంలోనే ఊహించని అధిక రిటర్న్స్ ఇస్తామనే కొత్త లేదా అపరిచిత వెబ్‌సైట్‌లను, వాట్సాప్ గ్రూపులను అస్సలు నమ్మవద్దు.

**లింకులు క్లిక్ చేయవద్దు:** ఈమెయిల్స్, ఎస్ఎంఎస్, వాట్సాప్ లేదా సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లేదా అపరిచిత లింకులను క్లిక్ చేయకూడదు.

**వ్యక్తిగత వివరాల భద్రత:** బ్యాంకింగ్ సమాచారం, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్ వివరాలు లేదా ఓటీపీలను ఎట్టిపరిస్థితుల్లోనూ అపరిచిత వెబ్‌సైట్‌లలో నమోదు చేయవద్దు.

**అదనపు ఫీజులు కట్టవద్దు:** ట్రేడింగ్ అకౌంట్ల నుండి మీ సొంత డబ్బును విత్‌డ్రా చేసుకోవడానికి 'ప్రాఫిట్ టాక్స్', 'అకౌంట్ అన్‌ఫ్రీజింగ్ ఫీజ్' లేదా 'ప్రాసెసింగ్ ఛార్జీలు' కట్టమంటే అది వంద శాతం మోసమని గ్రహించి, రూపాయి కూడా చెల్లించవద్దు.

**URL స్పెల్లింగ్స్ చెక్ చేయండి:** వెబ్‌సైట్ యొక్క ఖ=ూ స్పెల్లింగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించండి. అధికారిక వెబ్‌సైట్లను పోలి ఉండే నకిలీ డొమైన్‌ల పట్ల జాగ్రత్తగా ఉండండి.

**సత్వర సమాచారం:** ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, కంగారు పడకుండా వెంటనే మీ కుటుంబ సభ్యులకు తెలపండి. ఆలస్యం చేయకుండా వెంటనే ఔ1930ఔ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (www.cybercrime.gov.in) లో ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

- టాటా మోటార్స్ సిబ్బందికి ట్రాఫిక్ అవగాహన సదస్సు
- నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ: ఏసీపీ శంకర్ రాజు







బేగంపేట్, జూన్ 13: భారత శక్తి, 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బాధ్యతాయుతమైన రహదారి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు శనివారం బేగంపేట్‌లోని టాటా మోటార్స్ సిబ్బందికి ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ట్రాఫిక్-1 డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను ఎలా కాపాడవచ్చో ఈ సందర్భంగా ఉద్యోగులకు వివరించారు.

### ప్రమాదాలకు కారణాలు.. నివారణోపాయాలు

వాహనదారులు చేసే చిన్నపాటి పొరపాట్లు ఎలాంటి ప్రమాదాలకు దారితీస్తాయో పోలీసులు ఉదాహరణలతో వివరించారు. ముఖ్యంగా:

- అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే నష్టాలు.
- రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడటం వల్ల కలిగే ప్రమాదాలు.
- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, కార్లలో సీటు బెల్ట్ ప్రాధాన్యత.
- ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, లేన్ క్రమశిక్షణ వంటి అంశాలపై సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

క్రమశిక్షణతోనే ప్రమాదాల నివారణ

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన త్రిముల్గెర్రీ ట్రాఫిక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) జి. శంకర్ రాజు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను క్రమశిక్షణతో పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులుగా మారి, ఇతరులకు కూడా ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో త్రిముల్గెర్రీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్ పి. రమణయ్య, టాటా మోటార్స్ బేగంపేట్ మేనేజర్ ఎం.డి. సాదిక్, లా అండ్ ఆర్డర్ బేగంపేట్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న టాటా మోటార్స్ ఉద్యోగులు ట్రాఫిక్ నిబంధనలపై తమకున్న పలు సందేహాలను పోలీసులను అడిగి నివృత్తి చేసుకున్నారు. నగరంలో రహదారి భద్రతా సంస్కృతిని పెంపొందించడానికి, ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy